Regd. No. H. 18.

ఏడి ప్రతి 30 పైసలు

శుక్రవారం 1-12-72

నెల్లూరు ఐరన్
సిండికేటు
సంతపేట – నెల్లూరు

మావద్ద ఇనుములు అన్నిరక
ములు హోల్ సేలు వెలకు
లభించును. మద్రాసు విజయ
వాడ పోనుఅవసరంలేదు.

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడుగారు

సంపుటి 44   సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి   సంచిక 48

1-12-72 శుక్రవారం నుండి
నెల్లూరు శ్రీలీలామహల్ లో
ఉదయం ఆటతో ప్రారంభం

FANTASTIC
3 SUPER MEN
దేవాంతక, నరాంతక,
కాలాంతకులు

అద్భుతాలతోనిండిన ముగ్గురు దోపిడి
దొంగల అపూర్వ సాహసగాథ (కలర్)

# మూడుగంటల్లో ముప్పుతప్పింది!

పాపం! ఆంధ్ర మంత్రులు ఇరుకునపడి పోయారు; ఉభయ భ్రష్టత్వానికి గురి యయ్యారు; ఇటు ప్రజల విశ్వాసానికి దూరమయ్యారు, అటు నాయకుని విశ్వాసాన్ని కోల్పోయారు. వారి పరిస్థితి జాలి కలిగించేదే! కాలుజారితే, తొందరపడితే, దూరదృష్టిలోపిస్తే, తమ పరిధిని మరచి పోయి వ్యవహరిస్తే ఇంతేమరి!

వెనుకటిసంగతి ఎట్లయినా, ఇప్పుడు మాత్రం వీరు అనుసరించినవైఖరి సమంజస మైనదని చెప్పక తప్పదు. మంత్రిత్వాలను వదలుకోడానికి సిద్ధపడినా (అవి లేదు కావనుకోండి!), కాంగ్రెస్‌ను వదలిపోయే ప్రశ్న లేదుకాబట్టి, ప్రధాని నిర్ణయాన్ని ఆమోదించకతప్పలేదు. వారికికాంగ్రెస్‌నుండి బయటకుపోవడమంటే, భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే. తాత్కాలిక మైన వుద్రేకాలు, వుద్యమాల కోసం, శాశ్వతమైన కాంగ్రెస్ అనుబంధాన్ని కోల్పోవడం వివేకవంతమైనపని కాబోదనే దృష్టితోనే ఆంధ్ర మంత్రులు సరైన నిర్ణ యానికి వచ్చారు; చివరనైనా చేసిన పొర పాటును సరిదిద్దుకున్నారు.

ముల్కీసమస్య విషయంలో ఆంధ్ర మంత్రులు అనుసరించినవైఖరి పొరపాటని కూడా చెప్పడానికిలేదేమో! మంత్రివర్గంతో తెగతెంపులు చేసుకున్నట్లు, పార్టీబంధాల నుండి బయటపడినట్లు బహిరంగంగా ప్రతి పక్షీయుల ధోరణి ననుసరించి, ముల్కీ వుద్యమం హింసారూపాన్ని పొందుటకు దోహదకారులైనారనేదితప్పు; వారు ఆమాత్రమైనా గట్టిగానిలవకుంటే, ప్రధాని పంచసూత్రాల్లో ఆంధ్రులకు ఈ మాత్రం కూడా అనుకూలత వుండేదికాదేమో! అందు వల్లే వాళ్ళుచేసిన పొరపాటేమీలేదని అభి ప్రాయపడినా తప్పులేదు.

ఇప్పుడు ప్రధాని నిర్ణయానికి సమ్మతి తెల్పడంలో కూడా వారు పొరపాటు చేయ లేదని మా అభిప్రాయం. ఆంధ్ర మంత్రులు ముఖ్యంగా కోరింది, పట్టుబట్టి ది హైదరా బాదు నగరంలో ఆంధ్రుల ప్రతిపత్తిని గూర్చే ఆ విషయంలోవారు పాక్షికంగానే నైనా విజయాన్ని సాధించారని చెప్పాలి. జంట నగరాల్లో 1977 వరకే ముల్కీ నిబంధనలుంటాయని ప్రధాని చెప్పడం ఆంధ్ర మంత్రుల కోర్కెకు దగ్గరగానే వుంది. బ్రహ్మానందరెడ్డిగారు 1974 వరకు గడువు ఇచ్చారు; దాన్ని మరో మూడేళ్ళవరకు పొడిగించడం జరిగింది.



పదవి పరిధిలో
లక్ష్యసాధన!

అట్లనే వుద్యోగాల విషయంలో, విద్యా సౌకర్యాల విషయంలో, పోలీస్ సిబ్బంది విషయంలో–నగరంలో ఆంధ్రుల సమాన ప్రతిపత్తి దానావు గుర్తించబడినట్లే. అది గింపి నూటికి నూరుపాళ్ళు సమకూరలేద నేది తప్ప, సూత్రప్రాయంగా ఆమోదింప బడినాయి. అది ఆంధ్ర మంత్రులు సాధిం చిందేనని ఎందుకు అనుకోకూడదు? అదీ కాక, రాష్ట్రం విభజింపబడాలనికాని, ప్రత్యేక రాష్ట్రం కావాలనికాని వాళ్ళు కోర లేదు. సమైక్య రాష్ట్ర పరిధిలో ఆంధ్రుల హక్కులు కాపాడబడాలని కోరారు. అటు వంటప్పుడు ప్రధాని పరిష్కారాన్ని ఆమో దించక తప్పేదేముంది? అదీకాక రాష్ట్ర విభజన జరిగితే, మళ్ళీ ఆంధ్రలోకూడా అటువంటి ప్రాంతీయ తగాదాలు తలెత్త కుండా పోవని, రాయలసీమ – ఆంధ్ర, ఆంధ్ర – విశాఖ, శ్రీకాకుళం వేర్పాటులు రాకుండా పోవని ఆంధ్ర మంత్రులకేకాదు, అందరికీ తెలుసు. రాయలసీమకు ప్రత్యేక బోర్డువుంది; దానికి చట్టబద్ధమైన అధికా రాలు కావాలని ఇప్పుడే అడుగుతున్నారు. రేపు ఆంధ్ర ప్రత్యేకమైతే, తెలంగాణా ప్రాంతీయ సంఘంవంటి దాన్ని రాయల సీమవారూ కోరరని ఏముంది? విశాఖ–శ్రీకాకుళం వాళ్ళు తమకు ప్రత్యేక అవ కాశాలు కావాలని అభ్యర్థించరని ఏముంది? ఎవ్వరికీ పట్టని నెల్లూరవాళ్ళు ఇంకో విధంగా ఆలోచించరనేముంది? రాష్ట్ర విభ జన అంటే ఇటువంటి సమస్యలెన్నో వున్నాయి. ఆంధ్ర మంత్రులు ఇవన్నీ ఆలో చించే, పునరాలోచించే – కడకు సరైన నిర్ణయానికొచ్చారు. నాయకత్వ నొప్పిం చినా, ప్రజల్లో వెర్రితపడినట్లుండినా, వారు విజయాన్ని సాధించారనే చెప్పాలి క్లిష్ట సమయంలో బాధ్యతగా వ్యవహరించారనే చెప్పాలి ప్రతిష్టంభనను నివారించారనే చెప్పాలి.

అకపోతే, మొదట్లో అసమర్థుడని పించుకున్నా, ముఖ్యమంత్రి శ్రీ పి వి. నరసింహారావు తన మంత్రివర్గానికి నంబం ధించినంతవరకు వివేకగానేబయటపడ్డారు వివేకగానేకాదు, అవసరమైతే దృఢంగా నిలబడగలడని, చాకచక్యంగా పరిస్థితు లను అదుపులో తెచ్చుకోగలడనికూడా రుజువుచేసుకున్నాడు హైదరాబాదు రాజ కీయవర్గాలనుండి నిశ్చయనిరుంగా తెలు స్తున్నదానినిబట్టి, మొన్న మంత్రివర్గంలో ప్రధాని పంచసూత్ర పథకం ఆమోదం పొందకుండావుంటే; తర్వాత పరిస్థితులు, పరిణామాలు వివిధంగా, ఎంత విషమంగా తయారైవుండేవోనని అంటున్నాము పంచసూత్ర పథకంమీద తామొక నిర్ణయానికి రావడానికిరెండురోజులైనా గడువు కావాలని శ్రీ బి వి. సుబ్బా రెడ్డిగారు చెప్పారట. అది బయట

—తరువ 8 వ పేజీలో



పూర్తిగా దగ్ధం గావింపబడిన ఒంగోలు కలెక్టరాఫీసు

# ఒంగోలు– కష్టాలు, నష్టాలు

"ఆంధ్రసోదరులారా, మీలో ఆంధ్రత్వం నశించిందా? రాష్ట్ర రాజధానిలో మన సోదరులు ఘోరాతిఘోరంగా, మహా దారు ణంగా సజీవదహనం చేయబడుతుంటే మీరింకా నిద్రపోతున్నారా? లెండి, ఇక నైనా మేల్కొనండి, మీ హక్కులు రక్షించు కొనండి! సోదరసోదరీమణులారా! రండి, బంద్‌ను జయప్రదం చేయండి! కదలండి; కర్రలు, రోకళ్ళు, చేతికేది దొరికితే అది తీసుకొని స్టేషనుపైకి నడవండి!'

–21 తేది తూర్పురేఖలు మైకులో ఈ మందే, లౌడ్‌స్పీకర్ ల ద్వారా ఒంగోలు వీధుల్లో ప్రతిధ్వనించిన మేల్కొ లుపు ప్రసంగమిది. తెల్లవారుఝామున 3 గంటలనుండి ఒక జీపు వీధివీధి, సందు సందు తిరిగి ఈ మేల్కొలుపు పాడింది. ఒంగోలీయులు ఈ పిలుపుతో రెచ్చి పోయారు; హైదరాబాదులో ఆంధ్రులు సజీవంగా దహనం చేయబడుతున్నారనే అసత్యప్రచారాన్ని నమ్మి, ఉద్రేకంతో వురకలు వేశారు జనాన్ని పెడదోవపట్టిం చిన ఈ మేల్కొలుపు ప్రసంగం పాలిసు కాల్పులు మొదలవుతూనే ఆగిపోయింది!

ఒంగోలుజిల్లా కలెక్టరు శ్రీ బి రామ చంద్రప్రసాద్ 28తేది తన కొత్తంపాన గృహంలో ఏర్పాటుచేసిన పత్రికావిలే కరుల గోష్ఠిలో బంద్ రోజు దుర్ఘటన పూర్వాపరాలను సమీక్షించారు. కాల్పుల వుత్తరవు ఇచ్చి పరిస్థితిని శాంతపరచేవారని తనమీద ఉవ్వెత్తున వస్తున్న విమర్శలకు జవాబిస్తూ, కలెక్టరు, ఆ విధంగా వ్యవహ రించివుండకపోతే ఒంగోలీయులకు రక్షణ వుండేదికాదు; అరాచకం ప్రబలిపోయి వుండేది–అన్నారు. బంద్ పేరట కొన్ని

> **కలెక్టరు వివరణ**

అసాంఘికశక్తులు ఒక పథకం ప్రకారం దాడి చేయదలచుకున్నారని, వేల రూపా యలు వెచ్చించి, వందలాది రౌడీలకు సారాయి పట్టించి అరాచకాన్ని సృష్టించ డానికిప్రయత్నిస్తున్నారని, పనిగట్టుకొని తెల్లవారినుండి తిరుగుతూ ఆవేశ పూరిత ప్రసంగాలుచేసి జనాన్ని రెచ్చగొట్టి పారేశారని ఆయన అన్నారు.

కలెక్టరాఫీసుకు, తనబంగళాకు నిప్పం టించినప్పుడు స్టేషనులో అక్కడే వున్నారట; తన భార్య రక్షణార్థం, ప్రాణాలు అర

—తరువ 8 వ పేజీలో



నెల్లూరు కలెక్టరు ఆర్. పార్థసారథి నిరాహారదీక్ష చేస్తున్న వి. ఆర్. కాలేజి విద్యార్థులను కలుసుకొని విరమించుకోమని విజ్ఞప్తి చేస్తున్నారు; కుడివైపు చిత్రం - తన విజ్ఞప్తి మేరకు దీక్షవిరమించిన వి. ఆర్. విద్యార్థి రెహమత్‌కు నారింజ రసం అందిస్తున్న పార్థసారథి



ముల్కీ వ్యతిరేకోద్యమకారుల కోపాగ్నికి గురియైన కలెక్టరు బంగళా

జమీన్ రైతు

శ్రీ పరీధావి కార్తీక బహుళ ఏకాదశి శుక్రవారం 1-12-1972

# ఆమోదిద్దాం!

ప్రధాని పరిష్కారం ప్రకటితమైంది. అది నండి పూహిస్తున్నట్లే వుంది ఆ పరిష్కారం. ఇటు ఆంధ్రులకు ఆమోద యోగ్యంగాలేదు; అటు తెలంగాణీయులకు సమ్మతకరంగాలేదు. మధ్యవర్తుల తీర్పు సాధారణంగా ఈ విధంగానే వుంటుంది. అది ఒకరికి సంతృప్తి కల్గించేదిగానో, లేక ఇంకొకరికి నిరుత్సాహం కల్గించేదిగానో వుంటే, అది న్యాయమైన తీర్పుకాదు. సమైక్య రాష్ట్ర పరిధిలో, ఉభయులకు కొంతకు కొంతవరకైనా సమ్మతకరంగా వుండాలంటే, ఇంతకంటే మరోవిధంగా తీర్పువుండే వీలు లేదు. అందువల్ల శ్రీమతి ఇందిరాగాంధి పంచసూత్రాల పరిష్కారం వున్నంతలో సముచితమైనదనే చెప్పాలి

ముల్కీ నిబంధనలు అక్షరాలా అమలు చేసి తీరాలని తెలంగాణావారు పట్టుబట్టారు; వాటిని పూర్తిగా రద్దు చేసి తీరాలని ఆంధ్రులు ఆందోళన చేస్తున్నారు. తమ వాదాన్ని అంగీకరించకుంటే ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉభయులూ తెగించి కూర్చున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రాన్ని చీల్చడమో, లేక ఉభయులకు సంతృప్తికరంగా పరిష్కారాన్ని సూచించడమో తప్ప మార్గాంతరం లేదు రాష్ట్ర విభజన అనేది కేవలం ఆంధ్రప్రదేశ్‌తో పోయేదికాదని, అది జాతీయసమస్యని, అందులో ఎన్నో చిక్కులున్నాయని కేంద్రనాయకత్వము, ప్రభుత్వము భావిస్తున్నపుడు విభజనేతరమైన సామరస్యమార్గాన్ని అనుసరించడమొక్కటే మిగిలింది. ఆ మార్గమే అనుసరించబడింది. సమైక్యరాష్ట్రం అందరమూ అభిలషించతగింది కాబట్టి, అది ఆంధ్రుల శ్రేయస్సుకు, దేశ శ్రేయస్సుకు ముఖ్యమైందికాబట్టి, అసంతృప్తికొన్నైనా, అర్ధహృదయంతోనైనా ప్రధాని తీర్పును ఆమోదించదమే మంచిది

ముల్కీ నిబంధనలు శాశ్వతంగా వుండాలని కేంద్ర మూ భావించడంలేదు; అందువల్లనే ప్రధాని వాటిని తెలంగాణా ప్రాంతంలో 1980 వరకు, హైదరాబాదు-సికిందరాబాదులలో 1977 వరకు గడువు నిర్ణయించింది రాజధాని నగరం పట్ల ఆంధ్రుల అభిప్రాయాలను అవగాహన చేసుకోగలగబట్టే, ప్రధాని ఆ నగరాలకు ప్రత్యేకగడువును నిర్ణయించింది యథాతథంగా పార్లమెంటు గతంలో ఆమోదించిన గడువు 1974 వరకు వుంది. ఆ గడువునుమించి రాజధానికి మూడేళ్ళు, తెలంగాణా ప్రాంతానికి ఆరేళ్ళుమాత్రం అదనంగా అనుమతించిందన్నమాట. ఇటు ఆంధ్రుల- అటు తెలంగాణావారి అభిప్రాయాలను మన్నించడం, అభిలాషలను తీర్చడం- కొంతవరకైనా- ఇందులో ద్యోతకమవుతుంది. ముల్కీరూల్సుకు గడువు నిర్ణయించడం వల్ల ఆంధ్రుల కోర్కెకు పరోక్షంగా ఆమోదం తెల్పడమే అవుతుంది. 1980 తర్వాత తెలంగాణా ప్రాంతీయ సంఘం కాని, తెలంగాణాకు ప్రత్యేక బడ్జెట్ కాని లేక ప్రత్యేక సిబ్బందిగాని ఏమీవుండవు; ముల్కీరూల్సు రద్దుతో ఇవీ రద్దయిపోగలవు. అయితే ఏనిమిదేళ్ళు ఓర్చుకోవాలి; ఎనిమిదేళ్ళనేవి దీర్ఘకాలమేమీ కాదు.

ఉద్యోగాలకు సంబంధించి – ఇదివరకు నాన్‌గజిటెడ్ పోస్టులకు, గజిటెడ్ పోస్టులలో తాసిల్దారు పోస్టువరకు వర్తిస్తు డిన ముల్కీ నిబంధన; జూనియర్ ఇంజనీర్లు, సివిల్ అసిస్టెంటు సర్జన్ల వరకు విస్తరించబడింది. జంటనగరాలలో సెక్రెటేరియట్, ఉమ్మడి కార్యాలయాలు, రాష్ట్రశాఖాధిపతుల కార్యాలయాలకు సంబంధించి భర్తీ చేసే ప్రతి మూడు నాన్‌గజిటెడ్ పోస్టులలో రెండవది ముల్కీకి, అంటే తెలంగాణా వారికి, ఇవ్వాలని నిర్దేశించడం జరిగింది. ఇందులో ఆంధ్రులకు అభ్యంతరకరమైన అంశాలు రెండున్నాయి. గజిటెడ్ పదోన్నతుల్లో తాసిల్దారు పోస్టు వరకే వర్తిస్తు డిన ముల్కీ నిబంధనలు, అదనంగా మరిరెండు పోస్టులకు వర్తింపచేయడము; రాజధానిలోని రాష్ట్రకార్యాలయాల్లో భర్తీచేసే ప్రతిమూడు స్థానాల్లో ఒకటి విధిగా తెలంగాణావారికివ్వాలని నిర్దేశించడం తప్ప, తక్కిన రెండు స్థానాలు ఆంధ్ర ప్రాంతీయులతో భర్తీ చేయాలనే వివరణలేదు; ఆ రెండుస్థానాలకు దేశంలోని ఏ ప్రాంతీయుడైనా అర్హత కలిగి వుంటాడన్నమాట. వాస్తవంగా దేశంలో ఒకరాష్ట్రం ఇంకోరాష్ట్రం ఒక ప్రాంతం ఇంకో ప్రాంతం మధ్య ఏ విషయంలోనూ అడ్డంకులు లేకుండడం ఆరోగ్యకరంగా వుంటుంది కాని ప్రాంతీయ తత్వాలు వచ్చినప్పుడు, ఆ భావన లోనే పట్టుకోక తప్పదుగదా! పై రెండు అంశాలు ఆంధ్రవుద్యోగులకు నష్టదాయకంగా వుండవచ్చు పార్లమెంటు ఈ సూత్రాలను ఆమోదించవలసివున్నది కాబట్టి, ఈ లోగా చర్చలు, రాయబారాలద్వారా వాటి సవరింపుకు ప్రయత్నించుకోవచ్చు సామరస్య పరిష్కారానికి ఇవి ప్రతిబంధకం కానవసరంలేదు. ఉద్యోగాల ప్రాంతీయకరణవల్ల, ఆయా ప్రాంతీయుల ప్రమోషన్లకు భంగం లేకుండడమే కాక, ఉభయ ప్రాంతాలు ఉభయ ప్రజల మధ్య సమైక్యతాభావం పెంపొందే అవకాశంకూడా వుండవచ్చు.

వివాదాస్పదంగా వుండిన మరో అంశం- పాలిన్ కమిషనర్ ఆఫీసు రెండు ప్రాంతాలకు చెందినవారితో ఉమ్మడి పాలిన్‌దళం వుంటుందని ప్రధాని పంచసూత్రాలు వివరం చేస్తున్నాయి. ఈ విషయంలో ఎవరిలోనూ అసంతృప్తి కనపడదు.

రాజధానిలో ఆంధ్రప్రాంతీయుల విద్యావసతులకు సంబంధించికూడా పంచసూత్రాలలో అవకాశం కల్పించబడింది. ఆంధ్రులకు అదనంగా వసతులు సమకూర్చబడతాయనే హామీవుంది మనకు కావలసిందదే. అయితే ఆ అదనపు వసతులు ఏవిధంగా సమకూర్చబడతాయి, ఎంతవరకు సమకూర్చబడతాయనే వివరణ అందులో లేదు. ఆవివరణ అవసరమే.

ప్రధాని పంచసూత్రాలు ఆమోదయోగ్యాలు కాబట్టే; ఉభయులూ శ్రేయస్కరంగాను టూ, రాష్ట్రసమైక్యతను భద్రపరచేవి గనుకనే ఆంధ్ర మంత్రులు ఆమోదించడం జరిగింది. అట్లనే తెలంగాణా మంత్రులు కూడా ఈ విషయంలో మంత్రులందరూ ఒకే దృష్టితో, సంయమ దృక్పథంతో ఎంతో హుందాగా వ్యవహరించారనే చెప్పాలి సమైక్యరాష్ట్రసూత్రానికి అందరూ ఆమోదం తెలిపినవారైనప్పుడు, ఇంతకంటే భిన్నంగా వ్యవహరించలేరు. అంత తీవ్ర వైఖరిని అనుసరించినవారు, ఈనాడు ఈ విధంగా లొంగిపోవడమేమిటి అని విమర్శించవచ్చు. వారు అంత తీవ్ర వైఖరి అనుసరించబట్టే, ఈ మాత్రమైనా సత్ఫలితాలు వచ్చాయేమో? దాపుకు పెడితేకాని దారికిరాదు గదా! బాధ్యతగల మంత్రులుగా వారి వైఖరి సమంజసంగావుందని మా అభిప్రాయం

తుపాకి కాల్పుల తర్వాత; ఇరవైమంది అమాయకుల బలిదానం తర్వాత; కనీవినీ ఎరుగని విధ్వంసక కాండ తర్వాత, కోట్లాది రూపాయల నష్టం తర్వాత; ప్రజాజీవితం పదిపదిహేనురోజులపాటు స్తంభించిపోయిన తర్వాత; చదువు సంధ్యలు నెలరోజులకుపైగా పూర్తిగా పోయిన తర్వాత రాష్ట్రంలో పరిస్థితి ఇప్పుడే ప్రశాంతించింది. ఈ ప్రశాంతతను భంగపరచి, రాష్ట్రాన్ని తిరిగా అరాజకంపాలు చేయాలనే ప్రయత్నాలు కనుపిస్తున్నాయి. రెచ్చగొట్టడం, వుద్యమాలకు పిలుపునివ్వడం జరుగుతున్నది ప్రతిపక్షాలకు చెందినవారే కాదు; పాలక పార్టీవారుకూడా కేకలేస్తున్నారు, గంతులేస్తున్నారు, ప్రతిపక్షాలతో పోటీపడుతున్నారు. ఇది శోచనీయం. ఇప్పటివరకు విద్యార్థులు శాంతియుతంగా, చట్టబద్ధంగా, గంభీరంగా వుద్యమాన్ని నడిపారు; ముల్కీ నిబంధనల విషయంలో ఆంధ్రులు ఎంతగా ఆందోళన చెందివున్నారో ఢిల్లీ నాయకులచేత గుర్తింపు చేయగలిగారు. ఒక్క రోజు బయటశక్తులు ప్రవేశించడంతో ఎంత హోరాకోరి జరిగిపోయిందో మనం చూచాం ఈసారి వుద్యమమంటూప్రారంభమైతే, అది విద్యార్థులతో వుండదు; శాంతియుతంగా వుండదు; ఊహాతీతమైన హింసా ప్రజ్వాలనకు దారితీస్తుంది ఆ పరిస్థితి ఎవ్వరికీ శ్రేయస్కరంకాదు;



## నందిని విజయం

గెలుపు అనుమానాస్పదమనుకున్న శ్రీమతి నందినీశత్పతి ఢంకా బజాయించి గెల్చింది. ఒరిస్సా రాజకీయ అతిరథ మహారథులను, యోధాను యోధులను, ఘటనాఘటన సమర్థులను ప్రక్కకునెట్టి పారేసి, ప్రత్యర్థి బిరేనుమిత్రాను సొంత ఊరిలోనే రానివ్వకుండా 10 వేల మెజారిటీతో కటక్ నియోజకవర్గంనుండి శాసనసభకు ఎన్నికైంది. ఈ ఎన్నిక చూస్తే నందిని మహా సాహసి అనిపిస్తుంది. ఆగర్భ శత్రువులనైనా ఎన్నికల సమయంలో భుజాన చేతులువేసి, అవసరమైతే కాళ్ళుగిళ్ళు పట్టుకునే తత్వం తీర్చిందుకు పోయివున్న కాంగ్రెసువాళ్ళు చేయలేనిది చేసిందామె! ఒరిస్సా రాజకీయాల్లో వ్యతిరేకి పాణిగ్రాహి బిజూపట్నాయక్‌ను కాంగ్రెసులో చేర్చుకోడాన్ని ఎన్నికలముందుగా నందిని వ్యతిరేకించి

—కారవ 5 వ పేజీలో

కాము ఏ ప్రత్యేక రాష్ట్రమైతే కోరుతున్నారో, ఆ ఆంధ్ర ప్రాంతీయుల అభివృద్ధికే గొడ్డలిపెట్టు అవుతుంది. వట్టి ఆ పరిస్థితులు కల్పించవద్దని రాజకీయవాదులకు విజ్ఞప్తిచేస్తున్నాము. ప్రధాని పంచసూత్రాల్లో లోటుపాట్లు వుంటే సవరింపుకు ప్రయత్నించవచ్చు; వివరణలు అవసరమైతే వాటికొరకు కృషి చేయవచ్చు. అందుకు అందరి సహకారమూ వుంటుంది; కేంద్ర నాయకుల సానుభూతి వుంటుంది. రాష్ట్రహితంగా, దేశహితంగా వుండే ఆ మార్గాన్ని అనుసరించమని ఆంధ్ర నాయకులందరికీ మరీ మరీ విజ్ఞప్తిచేస్తున్నాము

నిమిషాలలో మాయమయిన జలుబు!



అమృతాంజనం

జలుబు, తలనొప్పి, నీరుపట్టడం, గొంతునొప్పి—వీటిని చిక్కుగా తగ్గించుకోండి. బాగా అమృత రాసుకోండి. అమృతాంజనం రాయండి. వెంటనే గుణం ఇస్తుంది. 78 సంవత్సరాలపైగా ఇంటింటి దీపమై వెలుగుతోంది అమృతాంజనం! ఎప్పుడూ ఒక సీసా దగ్గర ఉంచుకోండి. అమృతాంజనం లభించే పెద్ద సీసాలలోనూ, చిన్న డబ్బాలోనూ కూడా దొరుకుతోంది.

అమృతాంజనం 10 దినుసుల కలిపినది.
నొప్పులను, జలుబును తక్షణం, చల్లగా తగ్గిస్తుంది.

AMRUTANJAN Pain Balm

అమృతాంజన్ లిమిటెడ్

# జనవాణి ★ ★ ★

## ఇందిరమ్మను అభినందించాలి!

ముల్కీ సమస్యపై ఇందిరాగాంధి చేసిన పంచసూత్ర పరిష్కారం ఉభయ ప్రాంతీయుల భయసందేహాలను తీర్చేవిధంగా సమంజసంగా వుంది ప్రధాని చాకచక్యంతో రాష్ట్ర సమైక్యతను కాపాడినందుకు ఆమెను అభినందించాలి ఈ పరిష్కారంలో ఇంకా ఏమైనా సందేహాలుంటే వాటిని పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు అవసరమైన సవరణల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు ఇదే ప్రకటనను ఆమె యింకొన్ని రోజులముందే చేసివుంటే విశాలాంధ్రలో రక్తం చిందివుండేదికాదు, విద్యార్థుల చదువులు నష్టమైవుండేవికావు. ఏమైనప్పటికీ మన నాయకులు, ప్రజలు ప్రభుత్వానికి పూర్తి మద్దతునిచ్చి ఈ పరిష్కారం అమలు జరిగేట్టు చూడాల్సిన బాధ్యతవుంది. ఇంతకన్నా ప్రధానమైన సమస్యలున్నాయి; నిర్మాణాత్మకమైన కార్యక్రమ మెన్నో చేపట్టవలసివుంది వాటి పరిష్కారంలో విఘాతం ఏర్పడకుండా చూడడం అందరి బాధ్యత. జటిల సమస్యకు పరిష్కారమార్గం చూపిన ఇందిరమ్మ కౌశలం, దక్షతలను ఆంధ్రులు అభినందించి తీరాలి.

నెల్లూరు —బి. వి. ఎస్. కె మూర్తి

▲

## పంచాయతీ చౌకడిపోలు-ప్రభుత్వం అవకతవకలు

ప్రజలనేకవిధాలుగా ఆందోళన చేసిన ఫలితంగా జిల్లాలో పేదసాదల సౌకర్యార్థం చౌకడిపోలు పెట్టాల్సిందిగా పంచాయతీలకు జిల్లా కలెక్టరుగారు 26-8-72 తేది ఉత్తర్వులు జారీచేశారు. 9-9-72 తేదిన చౌకడిపోలు నడపడానికి పంచాయతీలకు అనుమతిస్తూ, వాటిలో అనుకోని నష్టం వస్తే ఆ నష్టాన్ని కలెక్టరు నిధులనుండి భరిస్తామన్నారు. ఆ ప్రకారం అనేక పంచాయితీలు చౌకడిపోలను నడుపుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరకు బియ్యం, సరఫరాచేస్తున్నాయి. నష్టం వచ్చిందని ఏ పంచాయితీకూడా కలెక్టరును పరిహారం కోరిందిలేదు

కాని పంచాయితీలు నడిపే చౌకడిపోలన్నిటిని మూసివేయవలసిందిగా 8-11-72 తేదిన కలెక్టరుగారినుండి మరొక ఉత్తర్వు వచ్చింది. చౌకడిపోల నష్టపరిహారం ఏ నిధులనుండి యివ్వాలి- అన్న ప్రశ్న రావడంతో ప్రభుత్వ కార్యదర్శి శ్రీ పి. ఎల్. శివరామ్ చౌకడిపోలన్నిటిని మూయించివేయాల్సిందిగా కలెక్టర్లకు ఆదేశమిచ్చారట.

అసలు పంచాయితీలు చేసే ప్రజాసేవ చాలా పరిమితం నిర్ణయించిన ధరలకు బియ్యం అమ్మటం ఆ గడ్డుకాలంలో పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఎంతో అవసరం ఈ పరిస్థితుల్లో-నష్టం వచ్చిందని ఏ పంచాయతీ పరిహారం కోరినప్పుడు- ప్రభుత్వం ఏదో మిషతో చౌకడిపోలను మూసివేయమనడం టోకు వ్యాపారాన్ని ప్రోత్సహించడమే అవుతుంది; రైసుమిల్లర్లకు తోడ్పడమే అవుతుంది. పంచాయితీ చౌకడిపోలను సక్రమంగా నిర్వహించడంతో వ్యాపారస్థులు కూడా చౌకడిపోల ధరలకే బియ్యం అమ్మాల్సి వచ్చింది; దోచుకొంటుండిన లాభాలు తగ్గాయి చౌకడిపోలు వారి లాభసాటి బేరాలకు, వ్యాపారానికి అడ్డుతగలడంవల్ల ప్రభుత్వమిది రాష్ట్రస్థాయిలో ఒత్తిడితో పంచాయితీ చౌకడిపోలను మూయించేట్టు చేశారనుకోవడం వాస్తవానికి చాలా దగ్గరగా వుంది ఇది ద్రోహం; పేదసాదలకు అన్యాయం.

ఇప్పుడు ప్రజలు, ప్రజాసంఘాలు ప్రజాప్రతినిధులు కదలాలి; ఆందోళన చేయాలి. పంచాయితీలచే చౌకడిపోలు నడ

— కారవ 8 వ పేజీలో

### నెల్లూరు వ్యవసాయ ఆర్థికాభివృద్ధికి

# ఒక చక్కెర ఫ్యాక్టరీ కావాలి!

## సహకార రంగంలో ప్రయత్నించవచ్చు!

చిత్తూరులో ఒక సహకార చక్కెర ఫ్యాక్టరీవుంది. పెద్దదే దానికి సంబంధించిన చెరకు వుత్పత్తిదారులు సమ్మెచేసి కూర్చున్నారు. టన్నుకు రూ 12 లు, రవాణా చార్జీలు ఇస్తే తప్ప చెరకు సరఫరా చేయబోమని రైతులు భీష్మించుకొనివున్నారు. నవంబరు 13 తేది తెరవబడిన ఫ్యాక్టరీ ఈగలు తోలుకుంటూ కూర్చొనివున్నదట అంటే తెరచీ మూతబడినట్లే వున్నదన్నమాట!

చిత్తూరు ఫ్యాక్టరీకి సంబంధించి రాబడి కియాలేమైనా వున్నాయేమో మనకు తెలియదు. ఫ్యాక్టరీ మాజీ అధికారి ఒకరు ఈ సమ్మెకు నాయకత్వం వహిస్తున్నట్లుంది; అందువల్ల ఈ అనుమానం కలుగుతున్నది. ఇది ఆధారంలేని అనుమానమే! సమ్మెదార్ల కోర్కెలు సమంజసమైనవా కావా అంటే చెప్పడం కష్టం. ప్రభుత్వం నిర్ణయించిన చెరకు ధర ఈ సంవత్సరం తొంభైరూపాయలనుకుంటాము; నూరు రూపాయలు కూడా లేదు. మూడు నాలుగేళ్ళ క్రితం, ప్రభుత్వ చెరకు ధర టన్ను ఎనభైరూపాయలే వున్నపుడు, ఆ ధరైనా ఇవ్వమని ప్రాధేయపడిన సందర్భాలున్నాయి. అప్పుడు చిత్తూరు ఫ్యాక్టరీ టన్నుకు డెబ్బయి రూపాయలు కాబోలు చెల్లించినట్లు జ్ఞాపకం. ఆ సంవత్సరం చక్కెర, బెల్లం ధరల మందకొడితనంతో పోలిస్తే, ఆ ధరైనా పొందిన చిత్తూరు ఫ్యాక్టరీ రైతులు అదృష్టవంతులనుకోవలసి వచ్చింది. అటువంటిది ఈ సంవత్సరం ప్రభుత్వ నిర్ణీత ధరకంటే ముప్పయి సంభైరూపాయలు అదనంగా ఇవ్వమనడమే గాకుండ, రవాణాచార్జీలుకూడా చెల్లించమని కోరడం సమంజసంగా కనపడదు. కాని చిత్తూరు రైతులు ప్రభుత్వ ధరను దృష్టిలో పెట్టుకొని అడగడంలేదు; గత సంవత్సరం ఫ్యాక్టరీ ఆర్జించిన లాభాల ఆధారంగా అడుగుతున్నట్లుంది. పత్రికల వార్తలనుబట్టి చిత్తూరు ఫ్యాక్టరీ 42 లక్షల రూపాయల లాభం ఆర్జించిందట! ఈ దృష్టితో చూచినపుడు వీరి కోర్కెలు అసమంజసమని ఎట్లా అనగలం?

ఇక్కడ చిత్తూరు సమస్య మంచిచెడ్డలను చర్చించడం మా వుద్దేశ్యం కాదు. నెల్లూరులోకూడా సహకార రంగంలో ఒక చక్కెరఫ్యాక్టరీ వుంటే, రైతుల ఆర్థికాభి

**రైతులోకం**

వృద్ధికి ఎంత దోహదకరంగా వుంటుందా అని వువ్విళ్ళూరడమే! ఏడెనిమిదేళ్ళక్రితం, బి. సి. సుబ్బారెడ్డి గారున్నపుడు ఒక ప్రయత్నం జరిగింది. దువ్వూరు బలరామరెడ్డిగారు చొరవ తీసుకున్నట్లున్నారు. ఎందువల్లనో ఏమో, ఆ ప్రయత్నానికి పురిటిలోనే సంధికొట్టింది!

నెల్లూరు, కోవూరు తాలూకా భూములు చెరకుకుకూడా అనుకూలమైనవని రుజువైంది. రెండవతరగతి భూమికూడా ఎకరాకు నలభైటన్నుల చెరకు వచ్చింది; సుక్రోజ్ శాతంలోకూడా తగ్గుదల ఏమీ లేదు. రెండుమూడు సంవత్సరాలు నెల్లూరు, కోవూరు తాలూకాల్లో వెర్రిగా చెరకుసాగు చేయడం జరిగింది; నేలకు కరవుతీరేట్లు రైతులు దెబ్బతినడమూ సంభవించింది. అందువల్ల నెల్లూరు నేలలు చెరకు సాగుకు అనువైనవని; రైతులకు సాగు అనుభవమూవుందని తేలుతుంది. ఇక విస్తారంగా ఫిల్టర్ పాయింట్లు వున్నాయి; ఏ సీజనులో అయినా సాగుచేయడానికి ఇదొక పెద్ద అనుకూలత. ఇక కావలసింది ఫ్యాక్టరీయే! గునుపాటి రామచంద్రారెడ్డి, ఆల్లూరు రామరెడ్డి గార్లకు సంబంధించిన అందసారి ఫ్యాక్టరీలున్నాయికాని, అవి రైతుకు లాభమూలేదు, నమ్మకమూలేదు. అందువల్ల పెద్ద ఫ్యాక్టరీయే కావాలి.

పరిమితుల కారణంగా భూకమతాలు తగ్గిపోతాయి; ధాన్యం ధరలకూ అంత భవిష్యత్తులేదు. అందువల్ల వున్న భూమిలో ఎక్కువ ఆదాయాన్ని ఏ విధంగా సంపాయించుకోవాలనేదే రైతులు ఆలోచించవలసిన సమస్య. అందుకు ఒక మార్గం చక్కెర ఫ్యాక్టరీ ఆధారంగా చెరకు వుత్పత్తి అని మా అభిప్రాయం. ఎకరాకు 40 టన్నులు పండితే; టన్ను 90 రూపాయలైతే; సంవత్సరానికి నికరంగా ఎకరాకు రూ 2000 లు మొదలు రూ 2500 లు వరకు మిగులుతుంది. చిత్తూరు రైతులు కోరుతున్నట్లు టన్నుకు రూ 125 లు ఇవ్వడమే జరిగితే, ఎకరాకు ఐదు వేల

—తరువాత 7 వ పేజీలో

# గూడూరు డివిజన్‌లో

# తుఫాను బీభత్సం—

## మేనకూరులో మరణాలు

నెల్లూరుకు తుఫాను గండం తప్పిపోయిందని సంతోషించాము కాని, ఆ సంతోషానికి ఆస్కారంలేదు. తుఫానుకు గూడూరు డివిజన్ తీవ్రంగానే గురైనట్లుంది. జిల్లాలో అపురూపమైన మంచి నిమ్మతోటలుండేది గూడూరు డివిజన్ లోనే. మొన్నటి తుఫానుకు ఆ తోటలు చాల బీభత్సమైనట్లున్నాయి. అరటితోటలుకూడా విపరీతమైన నష్టానికి గురైనట్లున్నాయి.

అంతేగాకుండా ప్రాణనష్టంకూడా సంభవించింది. వెంకటగిరి తాలూకా మేనకూరులో యానాదుల గుడిసెలు గాలికెగిరిపోయాయట. అందులో ఒక గుడిసెమీద ఒక పెద్దవేపచెట్టు పడి 25 సంవత్సరాల స్త్రీ, 10 సంవత్సరాల ఆమె బిడ్డ చచ్చిపోయారట; ఆమె భర్త మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడట. ఇందులో ఒక చిత్రమైన సంఘటన—మృతదేహాల కోసం మరురోజు వుదయాన (23 తేది వుదయం) ఆ వేపచెట్టును తేవదీయగా, ఆ చెట్టు క్రింద నలిగి మరణించిన ఆ స్త్రీ స్తన్యాన్ని కుడుస్తున్న రెండేళ్ళబిడ్డ చిన్నపాటి దెబ్బకూడా లేకుండా బ్రతికి వుండినదట. విషాదంలో ఇదొక నమ్మశక్యంకాని వింత!

మేనకూరులో చాలా నిమ్మచెట్లు పడిపోయాయట. ఆ గ్రామంవరకు పదివేల రూపాయల నష్టం వుంటుందని శ్రీ బి. సుబ్రహ్మణ్యం వ్రాస్తున్నారు.

గూడూరు, సూళ్ళూరుపేట నష్టాలను గూర్చి సమగ్రమైన నివేదిక లేదుగాని; వెంకటగిరి తాలూకాకు సంబంధించిమాత్రం అధికారికంగా కొన్ని వివరాలు తెలియవస్తున్నాయి.

ఆ తాలూకాలో షుమారు 1500 ఇళ్లు కూలిపోయి వుండవచ్చునని తెలుస్తున్నది.

**పల్లెలు**

17 చెరువులు తెగిపోయాయట. వీటికంటే నిమ్మచెట్ల నష్టమే విపరీతము, రైతులు కోలుకోలేనిది. తాలూకా మొత్తం మీద 1687 ఎకరాలలో నిమ్మచెట్లు నేలకూలినట్లు వార్త. దీనివల్ల నష్టం కనీసం 50 లక్షల రూపాయలుంటుందని అధికార అంచనా. ఇది 50 లక్షలు కావచ్చు, కోటి రూపాయలు కావచ్చు, అది వేరేసంగతి— ఎన్నోవందల కుటుంబాలకు జీవనాధారం పోవడమనేది గమనించవలసిన విషయం. నిమ్మచెట్లనేవి లేకుంటే వెంకటగిరి తాలూకాకు బ్రతుకులేదు. ఐదారు సంవత్సరా

—తరువాత 7 పేజీలో

# జమీన్‌దారీలను కదలించిన


# రైతుల పుల్లరి ఉద్యమం

**40 ఏళ్ళనాటి 'జమీన్‌రైతు'లో**

1931లో వెంకటగిరి సంస్థానానికి వ్యతిరేకంగా, జమీందారీ రైతుసంఘం ఆధ్వర్యాన, రంగాగారినాయకత్వాన బ్రహ్మాండమైన రైతు ఉద్యమం నడచింది. జమీందార్లు ప్రతియేడూ జనవరి, ఫిబ్రవరల్లో రైతులనుండి కంచెపుల్లరి వసూలుచేయడం అనవాయితీగా వుండేది. ఆ సంవత్సరం— జమీందార్ల అప్పులకు డబ్బు అర్జెంటుగా కావల్సివచ్చిందేమో—రెండు నెలలు ముందుగానే పుల్లరి చెల్లించాలని ఒక ఫర్మానా విడుదల చేసి, తమ సిబ్బందిని గ్రామాల మీదికి దండుపంపి, పుల్లరికట్టని కంచెలను మలగొట్టిస్తామని బెదిరించారు. దాంతో 'పుల్లరి వుద్యమం' ప్రారంభమైంది. పుల్లరి విపరీతంగా పెంచడాన్ని నిరసిస్తూ, సగానికి సగం తగ్గించాలని, వాయిదాల పద్ధతి మీద చెల్లించే ఏర్పాటు చేయాలని రైతు సంఘం కోర్తూ, రంగాగార్ని తమ ప్రతినిధిగా రాయబారం పంపించింది. రాయబారానికి అవకాశమిస్తే రైతుసంఘాన్ని గుర్తించినట్లవుతుంది గనుక జమీందార్లు అందుకు అంగీకరించలేదు. కుమారరాజాగారప్పుడు లండన్లోవున్నారు. ఆయన వచ్చినతర్వాత సమావేశమేర్పాటుచేస్తామని దివాన్జీ మాటయిచ్చినా; తర్వాత మహారాజా, ఆయన కుమారుడు పిల్లేసుపొమ్మన్నారు. దాంతో రాయబారం విఫలమైంది. 14-11-1931 'జమీందారీరైతు'లో రంగాగారు రాయబార వైఫల్యాన్ని గూర్చి వివరించి, తర్వాత జరిగిన రైతునాయకులతో తన సంప్రతింపుల ఫలితంగా 'సత్యాగ్రహమే శరణ్యమని తేల్చుకొన్న'ట్లు ఒక ప్రకటన చేశారు. ఆవారం 'జమీందారీరైతు' 'భగ్నరాయబారము' అనే శీర్షికతో వ్రాసిన సంపాదకీయం చదవండి—

"పుల్లరి విషయమై రయితు సంఘమునకు వెంకటగిరి జమీందారులకు జరుగుచుండిన రాజీ ప్రయత్నములు విఫలమైనందుకు చింతించుచున్నాము. సంఘమును గుర్తింపవలసి వచ్చునని జమీందారు రాయబారమును భగ్నముచేయుట చాల సంకుచితము. తాను నిషేధించిన కాంగ్రెసు తోడనే ప్రభుత్వము రాజీ చేసికొనినది వీరు మరువరాదు. రేపైనను దీనిని వీరు తప్పించుకొనజాలరు కావున సత్యాగ్రహాలే ప్రయోగకముందే ఇది జరిగిన ఇరుపక్షములకు శ్రేయము. రైతులు శాంతమును

—తరువాత 7 వ పేజీలో

## నెల్లూరు గుజ్జనగుళ్ళు
### విమర్శకుడు

### సి. ఎం. సర్టిఫికేట్!

ఈ వారంలో నెల్లూరు ఎం.ఎల్.ఎ.లు, ఎం. ఎల్. సి. లందరూ హైదరాబాదుకు హాజరం చేయించారు ప్రధానిప దస్తూత పథకానికి వీరి ఆమోదాన్ని పొందటమే పిలుపు విశేష్యాసట కాంగ్రెస్ వాళ్ళు ఆర్. వి ఆర్, రామగోపాల్ అందులో పై పట్టుకేదు. తక్కిన అందరూ సంతకాలు పెట్టారట.

ముఖ్యమంత్రిగారు మన జిల్లా శాసన సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ, గత పర్యాయం పార్టీ సమావేశంలో శ్రీ ఆనం వెంకటరెడ్డిగారు exemplary గా (ఆదర్శ ప్రాయంగా) మాట్లాడారని, అందరూ ఆయన్ను అనుసరించాలని అన్నారట. ఈ మాటలు కొందరికి పరవశం కలిగించాయి, కొందరికి ముల్లుల వలె గుచ్చుకున్నాయి అని ఒకరి వ్యాఖ్య!



### శుభాకాంక్షలు

శాశనసభ సభ్యులు మాజీ మంత్రి, మిడిసిపాటిలేని మైకా వ్యాపార ప్రముఖులు, గూడూరు మాజీ మునిసిపల్ చైర్మన్ శ్రీ పొన్నలూరు కోటారెడ్డిగారి షష్టిపూర్తి మహోత్సవం ఈ రోజు వుదయం గూడూరులోని వారి నివాసం లోనే ఘనంగా జరిగింది. శ్రీ దేవిరెడ్డి కోదండరామరెడ్డి - విద్యావతమ్మ దంపతులు ఈ వుత్సవాన్ని నిర్వహించారు. అశేష బంధుమిత్రులు అభిమానులు విచ్చేసి కోటారెడ్డిగారికి శుభాకాంక్షలు తెలియ చేశారు.

కోటారెడ్డిగారు ఈ విధంగానే నూరేళ్ళ పండుగ జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ, 'జమీన్‌రైతు' శుభాభినందనలు తెల్పుతున్నది.

పి. వి. గారి సర్టిఫికేట్టు లేదు - త్వరలో విడుదలగానే వుంటుంది. కోవూరు విషయం మాదాంగదా!

### ప్రాయోపవేశాలు— పరిస్థితులు

నిరవధిక నిరాహారదీక్షలో వుండిన వి. ఆర్. కాలేజి విద్యార్థినాయకుడు శ్రీ రహమత్ బాషాను కలెక్టరు శ్రీ పార్థసారధి ప్రతినిధిగా సాక్షాత్కరింపగా విరమింపజేశారు. దయానందరావు చెప్పినట్టే, ప్రధాని పథకాన్ని ప్రజలు ఆమోదించకుంటే తాను తిరుగా డిసెంబరు 15 తేదీ నుండి దీక్ష బూనగలనన్నాడట శ్రీ రహమత్.

వి. ఆర్. కాలేజి విద్యార్థులు శ్రీ కోటేశ్వరరావు, సుబ్బారావుల ప్రాయోపవేశం పదవరోజుకు చేరుకుంది. కలెక్టరుగారు వీరిని విరమణకూ ప్రయత్నించినట్టు లేదు. వారు విరమించలేదు.

ఇది రెండూకాక— కె. వి. ఎస్. చారిగారట— కలెక్టరాఫీసువద్ద నిన్నటినుండి దీక్షవహించి వున్నారు. వీరిదీ ఆమరణ దీక్షేనట.

• • •

ఈ వారంలో కొవ్వూరు శ్రీ ఎం. పట్టాభిరామరెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సమైక్యతా సభ జరిగింది. ఏ. సి. రెడ్డి, పరుచూరు రామకోటయ్య, ఎన్. వి. కృష్ణయ్య, జక్కావెంకయ్య ప్రభృతులు మాట్లాడారు. పదవులు పంచుకునే కాంగ్రెస్ వాములు చేయలేనిపని, కమ్యూనిస్టులైనా చేయగలిగినందుకు సంతోషించాలి!

• • •

ఈ వారమంతా పరిస్థితి ప్రశాంతంగా వుంది. జిల్లాలోని విద్యాలయాలన్నీ 4 తేదీ వరకు మూసివేయబడ్డాయి.

మొన్న గుంటూరులో జరిగిన విద్యార్థి ప్రతినిధుల సమావేశానికి నెల్లూరు నుండి కూడా ప్రతినిధులు పోయివచ్చారట. గుంటూరుసభ ఈ రోజునుండి వుద్యమ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఘెరావోలు, జండా ప్రతిష్ఠాపనలు, నిరవధిక బంద్‌లు. ఇందులో రైళ్ళు, బస్సులను ఆపే అంశం కూడా వుంది.

నిన్న ఆంధ్ర ప్రజాపరిషత్ అధ్యక్షుడు శ్రీ గౌతు లచ్చన్న నెల్లూరు వచ్చి తిరుపతి పోయారు; తిరుగు ప్రయాణంలో వచ్చి తగలొమ్మ ఆంధ్ర ప్రజాపరిషత్తు వారి కరపత్రాలు కూడా దిగుమతైనాయి. పంచసూత్రాలను వ్యతిరేకిస్తూ, విశాలాంధ్రలో ఒక ప్రకటన పారేసి అన్నిచోట్ల పరిస్థితులు చూచుకొంటూ శ్రీ బెజవాడ పాపిరెడ్డిగారు నెల్లూరు చేరారు. ఒక్క జి. వి. చేర్మన్ గోపాలకృష్ణారెడ్డిగారు తప్ప, కాంగ్రెసు శ్రేష్ఠులెవరూ నెల్లూరులో వున్నట్టు లేదు.

నెల్లూరు విద్యార్థులు ఇప్పటివరకు చాల హుందాగా వ్యవహరించారు; అభినందనలకు పాత్రులయ్యారు. ఇకముందు కూడా రాజకీయవాదులకు దూరంగావుండి, గడించిన కీర్తి ప్రతిష్టలను నిల్పుకోగలరనే ఆశిస్తాము.

### ఎన్. సి. రాజీనామా!

నెల్లూరులో కూడా ఆంధ్ర ప్రజాపరిషత్ ఏర్పడింది. ప్రజాపరిషత్తు అంటే, ప్రత్యేకాంధ్రకోసం పోరాటం జరిపే సంఘమన్న మాట. దీని కేంద్రం గుంటూరు; దీని అధ్యక్షుడు శ్రీ గౌతు లచ్చన్న.

30 తేదీ శ్రీ బెజవాడ పాపిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. విద్యార్థి, ఎన్. జి. ఓ. తదితర వర్గాల ప్రతినిధులు 300 మంది హాజరయ్యారు. శ్రీ బి. సి. కొండయ్య ప్రారంభోపన్యాసం చేశారు. అరనెలపాటైనా నిలవగలిగిన పటుత్వమైన వుద్యమాన్ని నిర్మించాలన్నారు శ్రీ పాపిరెడ్డి. శ్రీ లచ్చన్న మరి వుద్యమ ఆద్యంతాలు వివరించారు. శ్రీయుతులు నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎం. సుందరాచారి, సి. వి. కృష్ణారావు వగైరాలు వుపన్యసించారు. అందరివీ నివ్వాలు కక్కే వుపన్యాసాలే!

సమావేశంలో కోటసమితి అధ్యక్షుడు శ్రీ నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి, కోవూరు పంచాయితీ అధ్యక్షుడు శ్రీ అత్తివల్లి సుందరరామరెడ్డిగార్లు తమ పదవులకు రాజీనామాలు ప్రకటించారట.

జిల్లా ఆంధ్రప్రజాపరిషత్తుకు బెజవాడ పాపిరెడ్డి అధ్యక్షుడుగా; ఎం. మాలకొండయ్య, ఎన్. సి. రెడ్డి ఉపాధ్యక్షులుగా; సి. గోపాలరెడ్డి, ఎం. సుందరాచారి కార్యదర్శులుగా ఎన్నుకోబడినారు. సభ్యులలో ఎం. గోపాలదాసు, ధనెంకుల నరసింహం, సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి, సి. సి. సుబ్బరాయుడు, పొట్లపల్లి సుబ్రహ్మణ్యం, సి. వి. కృష్ణారావు, బట్టేపాటి రామిరెడ్డి ప్రభృతులున్నారు.

# భయంకరమైన దారిదోపిడి!
## వెంకటాచలం సమీపంలో కత్తులు, పిస్తోళ్ళతో రెండు కార్ల అటకాయింపు
### చిత్రనిర్మాత గిరిబాబు, డాక్టరు హెబ్బార్ దోచుకోబడ్డారు!

గత వెంకటాచలం మొనగాళ్ళు, దారులు కాచే దోపిడిగాళ్ళు చేసిన ఈ ఘోరం విన్నారా?

29 తేది రాత్రి 9-30, 10 గంటల మధ్య, వెంకటాచలం – మనుబోలు నడుమ, ట్రంకు రోడ్డుమీద కాపాటంగా దారుణమైన, భయంకరమైన, హైవే దారి దోపిళ్ళు రెండు జరిగాయి. రెండు దోపిళ్ళూ ఒకే ముఠా చేసినట్టుంది. మొదటి దోపిడికి చిత్ర నిర్మాత గిరిబాబు, రెండో దోపిడికి నెల్లూరు కంటి డాక్టరు శ్రీ కె. ఎస్. బి. హెబ్బార్ గురయ్యారు.

రాజమండ్రిలో ఔట్‌డోర్ షూటింగు పూర్తిచేసుకొని మద్రాసు వెళ్తుండిన నిర్మాత గిరిబాబు ఫియట్ కారును అప్పుడ్నుంచి రామదాసు సత్రం మధ్య ఒక ఆకుపచ్చరంగు అంబాసిడర్ కారు అటకాయించింది. అటకాయించడమంటే అల్లాయిట్లా కాదు; యమస్పీడులో వచ్చి కారును ఢీకొని ఆపేసింది. ఆ కారులోనుండి ఇద్దరు వ్యక్తులు దిగారట. ఒకరి చేతిలో పిస్తలు, మరొకరి చేతిలో కత్తి వుందట. మొహాలకు నల్లగుడ్డలు కప్పుకున్న ఆ యిద్దరూ దుక్కల్లాగా వున్నారట. పిస్తల్ గురిచూపి, అరిస్తే ప్రాణాలు తీసేస్తామని బెదిరించారట. గిరిబాబు, అతని స్నేహితుడి వద్ద వుండిన మూడు కెమెరాలు, ఒక ట్రాన్సిస్టరు, ఒక రికార్డు ప్లేయరు, రు.800 ల రొఖం, ఒక వుంగరం, రెండు చేతి గడియారాలు, ఒక సూట్‌కేసు దోచుకొని వుడాయించేశారట. సినిమాల్లో తప్ప నిజ జీవితంలో యిట్లాంటి దోపిళ్ళు చూడని నిర్మాత గిరిబాబు కలవరపడుతూనే బెరుకుగా ఆ దుండగులు గూడూరు వైపు రయ్‌మని వెళ్ళిపోయారట!

ఇది జరిగిన కొద్ది నిముషాల తర్వాత, 9-45 గంటలప్పుడు మనుబోలు సమీపంలో రెండవ దోపిడి జరిగింది కంటి డాక్టరు శ్రీ కె. ఎస్. బి. హెబ్బార్ గూడూర్లో తన క్లినిక్ చూచుకొని కార్లో నెల్లూరికి రావడంలో మనుబోలు స్టేషను రోడ్డు దగ్గరకి వచ్చేటప్పటికి వెనుకనే ఒక అంబాసిడర్ కారు పక్కవైపునుండి వచ్చి, డాక్టరు కారును ఢీకొన్నది. డాక్టరు తెప్పరిల్లేలోగా ఆ కార్లోనుండి ముగ్గురు యువకులు దిగి కత్తులు పిస్తళ్ళు చూపి, ఉన్నదంతా అక్కడ పెట్టమని దబాయించారట. సిగరెట్ యూరం, పైలెట్ పెన్నా, రు.160 లు రొక్కం చిన్నటార్చిలైటు పెరుక్కున్నారు; ఇంతలో ఏదో లారీ వస్తు. కారు రిపేరు చేస్తున్నట్లు నటించారట. కారు టైర్లు పొడిచి, ప్లగ్గులు పూడపెరికి, తాళాలు తీసుకొని అందాక వుండి లిక్కు పారేస్తాము పెరికిన కారు తిప్పుకొని గూడూరు వైపు వెళ్ళాయిందారట.

కార్లో దిగినవాళ్ళు టీషర్ట్లు గొట్టాం ప్యాంట్లు వేసికొని ఆధునికంగా వున్నారట. అందరూ 25-30 ఏళ్ళ మధ్య వయస్కులేనట. మొహాలకు నల్లగుడ్డలు కట్టుకొన్నారట. శుద్ధమైన హిందూస్తానీ మాట్లాడారట. కారుకు నంబరు ప్లేటు లేదట గాని రెడ్ఫ్క్స్. వి. జి. అని మాత్రం వ్రాసి వున్నదట. వాళ్ళు మనవైపు వాళ్ళు కారేమో నంటారు డాక్టరుగారు. వాళ్ళు హిందూస్తానీ కూడా మనవాళ్ళ భాషమాదిరి కల్తీగాకాని, యాసగాకాని లేదట.

దీన్నిబట్టి చూస్తే ఏదో కొత్త ముఠా దిగినట్టుంది మన జిల్లాలో రకరకాల దోపిళ్ళు ఉంటున్నాం కాని యిట్లా పిస్తళ్ళు, కత్తులతో ఇంజనీరు సిరిమాల పక్కనే దోపిళ్ళు మనకలవాటు లేదు.

డాక్టరుగారి కారుకు ఆకుపచ్చ రంగు అంటుకున్నది. ఆ దుండగులవారు ఒరసుకొనివచ్చి డాష్ చేయడంవల్ల ఆ రంగు అయింది. అదీ కొత్తగా వేసిన రంగుగా వుంది. మొత్తానికి అది పచ్చరంగు కారు; వెస్టుబెంగాల్ రిజిస్ట్రేషను గూడూరు వైపు వెళ్ళిపోయిందిగనుక మద్రాసుకేమయినా పరారయింటే ఏమోననే అనుమానంతో పోలీసుగాలిస్తున్నది. గిరిబాబు, డాక్టరు వేర్వేరుగా అర్ధరాత్రి నెల్లూరుచేరి పోలీసు రిపోర్టు ఇచ్చారు. డిప్యూటీ ఎస్. పి. శ్రీ అనంతరామరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాచల ప్రాంతంలో యిట్లాంటివి కాకపోయినా, యింకాస్త చిన్న సైజువి చాలా దుండగాలు జరుగుతున్నాయి. ట్రంకురోడ్డుమీదనే జరుగుతున్నా రక్షణ లేకుండాపోతుంది. పోలీసుస్టేషను ఒకటి వుండి ప్రయోజనం కన్పించడం లేదు.

### బలహీనవర్గాల నిరుద్యోగులకు వుపాధి

కలెక్టరు పార్థసారధిగారు, ఈ గందరగోళపు పరిస్థితుల్లో కూడా, బలహీన వర్గాల సేవను విస్మరించినట్లు లేదు, విరమించినట్లులేదు.

హరిజన, గిరిజన, బలహీన వర్గాలలో నిరుద్యోగులుగావున్న విద్యావంతులకు వుపాధి కల్పించే విషయమై మొన్నొక సమావేశాన్ని ఏర్పాటుచేసి చర్చలు జరిపారు; ఆయనే కొన్ని సూచనలు చేశారు: అవకాశమున్న ప్రతి హరిజన గిరిజన కాలనీలో స్కూళ్ళు పెట్టడం; ల్యాండు కాలనైజేషన్ స్కీమును ప్రయోగాత్మకంగా చేపట్టడం; టైప్‌రైటింగు ఇన్‌స్టిట్యూటును నెల్లూరులో నెలకొల్పడం; చిన్నరూట్లలో బస్సులను నడుపుటకు డ్రైవర్ల కోఆపరేటివ్ సొసైటీ ప్రారంభించడం; క్యాంటీన్ ఒకటి పెట్టడం, దీనికి ఆర్థికంగా సహాయపడడం— ఇవీ కలెక్టరుగారి ప్రతిపాదనలు. గ్రామాలలోని పోస్టాఫీసులలో హరిజన గిరిజన మెట్రిక్యులేట్లను బి. పి. ఎం. లుగా నియమించుటకు నిబంధనను సడలించవలసిందిగా పోస్టల్ అధికార్లకు వ్రాయుటకు కూడా నిర్ణయించబడింది.

సమావేశంలో శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు కూడా కొన్ని సలహాలిచ్చారట.

### వాణిజ్య మండలి

నెల్లూరుజిల్లా ఛేంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి 26 తేదీ ఈ క్రింది కార్యవర్గం ఎన్నుకోబడింది:

అధ్యక్షుడు – సి. సి. సుబ్బారాయుడు; ఉపాధ్యక్షులు – పెద్దపల్లి వెంకటేశ్వర్లు, దక్కా సత్యనారాయణగుప్త (కావలి), బికా ఆనందయ్య బి. ఎ. (ఆనర్స్) -సూళ్ళూరుపేట; కార్యదర్శి – పొట్లపల్లి సుబ్రహ్మణ్యం; జాయింట్ సెక్రెటరీ- ఎం. ఎల్. నరసింహంగుప్త; ట్రెజరర్- వాకిచర్ల వీరయ్య; గౌరవకార్యవర్గ సభ్యులు – కె. ఆదిశేషగుప్త బి. ఎస్‌సి., బి. ఎల్., కె. రాధాకృష్ణయ్య బి. కాం., ఎ. సి. ఎ. తాలూకాల వారీగా 19 మంది సాదా కార్యవర్గ సభ్యులుకూడా వున్నారు.


### శ్రీ విజయ ఫైనాన్స్ కార్పొరేషన్
జొన్నలగడ్డవారివీధి - నెల్లూరు-1

**బెనిఫిట్ కంసేవింగ్స్ స్కీం**

13వ డ్రా : : 30-11-72

114 చింతం కోటిరెడ్డి, కరేడు
1405 జవ్వం ప్రకాశర్, కందుకూరు
1183 జవ్వా పోలయ్యశెట్టి, వెంకటగిరి
871 సేట్ భవాజీలాల్ పర్సుమల్ అండ్ కో., నెల్లూరు
227 కె. హైమావతి, నెల్లూరు-1.


### 9 తేది రైతుల సమావేశం
**— విజ్ఞప్తి —**

అన్ని వృత్తులలో వారు సమైక్యంగా పనిచేస్తూ వారివారి కోర్కెలను నెరవేర్చుకొంటున్నారు. రైతులుమాత్రం అనైక్యతమూలంగా నానాటికి బలహీనులై, ప్రభుత్వదృష్టిలో ఆటబొమ్మలుగా పరిగణింపబడుతున్నారు. రైతులు తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించేటట్లుచేసి, తాము లాభపడదలచితే తమ రైతు సంఘాలను పటిష్టంగా వుంచుకొని ప్రభుత్వంతో నిర్భయంగా పోరాడాలి. భూసంస్కరణలతో రైతులపని చివరిదశకువచ్చింది. ఇప్పుడైనా మేల్కొనండి. అందరూ ఏకంకండి. ఈ అదును తప్పితే సర్వనాశనం చెందుతాము.

రైతు శ్రేయోభిలాషి అయిన

**పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు**

**9-12-1972 తేది 3 గంటలకు**

నెల్లూరు టవున్‌హాలులో మాట్లాడెదరు. రైతులంతా తప్పక విచ్చేసి సభను జయప్రదంచేయ ప్రార్థన.

ఇట్లు

కార్యదర్శి, అభ్యుదయ రైతుసంఘం.

# మాటకచేరి

★ గోపి ★

## నెలతక్కువ బిడ్డగా పుట్టిన ఉద్యమం-ఎన్జీఓలకోసం విద్యార్థులు నష్టపోవాలా?

అప్జల్ ఒక చిన్న తీర్పు — ఇంత కాలాల రాష్ట్రంలో లక్షలాది ప్రజల్లో కొన్ని వేలమంది ఉద్యోగులకు మాత్రమే సంబంధించిన తీర్పు — సుప్రీంకోర్టు యిచ్చిందే పొండి; మార్పుచేసుకోడానికి కోరేటంత అవకాశమున్న ఆ తీర్పును పహాపూనత వహించిన మన ప్రభుత్వం పరిశీలించి, సవరించి, అందరికీ కాకపోయినా కొందరికి, అంతా కాకున్నా కొంత సంతృప్తికరమో, అసంతృప్తికరమో అయిన నిర్ణయం తీసుకోడానికి ఎంత రాద్ధాంతం జరగాల్సి వచ్చిందో చూడండి దౌర్భాగ్యదేశం! ప్రభుత్వంలో కదలిక రావడానికి ఒక బ్రహ్మాండమైన ఉద్యమం లేవడం తప్ప; 30, 40 మంది ఉత్తపుణ్యానికి, తాము చేయనినేరానికి, ఎరుగని కారణానికి అమాయకంగా, అన్యాయంగా, దారుణంగా బలికావడం తప్ప మరొక మార్గంలేదా ఈ ప్రజాప్రభుత్వంలో? దీనికి మాటికి ఉద్యమాలు లేవాలి, సమ్మెలు చేయాలి, నిరాహారదీక్షలు పూనాలి, రైళ్ళు కాలాలి, ప్రాణాలు పోవాలి; అప్పటికిగాని మన మంత్రులకు జ్ఞానోదయంకాదా? నిద్ర మత్తువదలదా? ఈ పరిస్థితి సిగ్గులేనితనంకాక మరేమిటి? ఇంత ఆందోళనకు, యింత ప్రాణనష్టానికి, యింత గందరగోళానికి బాధ్యులెవరోకాదు — మనల్ని పాలిస్తున్న ప్రభువులే! ఒక నిర్ణయం తీసుకోడానికి మీనమేషాలు లెక్కపెడ్తూ, కాలయాపన చేస్తుంటే, అవతల ఎందరి ప్రాణాలు గాలిలో కలసిపోతాయోననే మానవతా దృష్టికూడా లేదే ఈ నాయకుల్లో! ఏంచేయాలి వీళ్ళను?

ఇవి మన ఉద్యమాల తీరుతెన్నులు ఈవారం '40 ఏళ్ళనాటి జమీన్ రైతు' శీర్షికలో వెంకటగిరి రైతుల పుల్లరి ఉద్యమానికి సంబంధించిన వార్తవుంది, చదవండి ఆ మహోద్యమం ఎట్లా జరిగిందో తెలుస్తుంది? జమీందార్లు రైతులనుండి అక్రమంగా పుల్లరి వసూలు చేస్తుంటే రైతు సంఘం ప్రతిఘటించింది, తమ ప్రతినిధులను రాయబారం పంపింది. ఆ రాయబారం విఫలమైన తర్వాత, నాయకులంతా సమావేశమై సమాలోచనలుచేసి, మార్గాంతరం లేని పరిస్థితుల్లో సత్యాగ్రహం పిలుపునిచ్చారు. అప్పటివరకూ రైతుల హృదయాంతరాళాల్లో ఆందోళన వుండిందేకాని, అది కట్టలు తెంచుకొని పురికలేదు. వేచి చూచారు; ప్రభుత్వానికొక అవకాశమిచ్చి చూచారు; ప్రతినిధులను రాయబారం పంపారు. అది లాభంలేదని తేల్చుకొన్నాక సత్యాగ్రహానికి పూనుకున్నారు. అదీ ఉద్యమమంటే! అప్పుడే దానికొక విలువ, ప్రయోజనం, పవిత్రత, విశిష్టత!

మన ముల్కీ ఆందోళనే తీసుకోండి సుప్రీంకోర్టు తీర్పు వెల్వడకముందే సమ్మెలకు దిగాం మనం. స్కూళ్ళుబంద్, కాలేజీలు బంద్, ఆఫీసులుబంద్, రైళ్ళుబంద్. వీటన్నిటికన్నా ముందు మన మంత్రుల నోళ్ళు, తలలూ బంద్! నెలరోజులుగ్గాని మంత్రులు కలెగజేసుకొని చర్యలకు దిగలేదు. దిగినా మరుక్షణంనుంచీ ఎవరికి వారే యమునాతీరే అన్నట్టు వ్యవహరించారు; ఇది మంత్రివర్గమా, రణరంగమా అన్నట్టు ప్రవర్తించారు. ఢిల్లీ దర్బారు తిరిగి చేసుకొని (ఈ తోగా జన్మదినాలు వగైరాల వేషగ్గా ఎండ కాకారువుతుంది!) ఒక నిర్ణయం యిచ్చేలోగా ఇక్కడ మంటలంటుకున్నాయి. ఆ మంటల్లో ఇంకేకాదు, ఒళ్ళూ అహుతైపోయాయి!

నిర్ణయం వచ్చినతర్వాత, అది నచ్చకపోతే, అది మనకు శ్రేయస్కరం కాదనుకుంటే—అప్పుడుప్రారంభం కావల్సిన ఉద్యమం, రెండునెలలు ముందుగానే మొదలై అరాచకాన్ని రెచ్చపెట్టింది. నెలతక్కువ బిడ్డగా పుట్టిన ఈ ఉద్యమానికి పుట్టిన్నే సందికొట్టింది! ఉత్తరకుమార ప్రగల్భాలు పల్కిన మంత్రిపుంగవులు 'గప్‌చిప్ సాంబార్ బుడ్డి' అయిపోయారు. ఇందిరమ్మ గీసిన గీటు ఒక్క అంగుళం దాటడానిక్కూడా దమ్ములేని మన మంత్రులు పరోక్షంగా ఎందుకింతగా జనాన్ని రెచ్చగొట్టినట్టు? 'మేమున్నాం, ఆ బాధ్యత మాకువదలండి; మీరు ప్రశాంతంగా వుండండి' అని చెప్పే తాహతులేని వీళ్లు మా నాయకులని చెప్పుకోవడం మనకు సిగ్గుచేటుకదా చెప్పండి?

అది తమ ఒక్కరి సమస్యే అయినట్లు-సమ్మెలు చేస్తున్నారు.

ఇది ప్రధానంగా ఎన్జీఓల సమస్య. దీన్నే నిరుద్యోగ సమస్యగా పిలుస్తున్నారు. నిజమే. ఐతే, ముల్కీకి వ్యతిరేకంగా పోరాడినంత మాత్రాన్నే ఈ దేశంలో—పోనీండి ఈ రాష్ట్రంలో, కనీసం ఈ జిల్లాలో — నిరుద్యోగ సమస్య అంతులేకుండా మాయమై పోతుందని ఎవరైనా గుండెమీద చేయివేసుకొని చెప్పమనండి;

దీనికంతటికీ ఒక్కటే సమాధానం—అవకాశవాదం. మన నాయకులకు పరిష్కారం కావల్సింది ముల్కీసమస్యకాదు; మన మంత్రుల దృష్టిలోవుంది ఆంధ్రుల భవిష్యత్తూకాదు. ఈ పి. వి. వుంటాడా, వూడ్తాడా— ఇదే వారిదృష్టి. ఊడేటట్టు వున్నాడు, యింకాస్త గట్టిగా వూగిస్తే తొందరగా వూడ్తాడు— ఇదే వారి ఆరాటం. ఈ ఆరాటం తీరకపోతే రాష్ట్రం రెండు కాదు, పదిముక్కలైనాకావాలని పోరాటం లేవడానికి వాళ్ళు సిద్ధం! ఎంతటి దౌర్భాగ్యమో చూడండి!

ఎన్జీఓలమీద ఈ కాలమిస్టుకు లోలెడంత సానుభూతివుంది పాపం వాళ్లి ముల్కీ జోనుగో యిరుక్కొని నతమతం కాబోతున్నారంటే ఈ కాలమిస్టు జాలి పడుతున్నాడు. ఐతే వాళ్ళు చేసినపని ఏమైనా సవ్యంగా వుందేమో ఆలోచించండి సమ్మె అన్నారు. విద్యార్థులు సమ్మెకు దిగారు; నిరవధిక సమ్మెలు చేస్తూ చదువులు పోగొట్టుకొంటున్నారు. నిరాహారదీక్షలు చేస్తూ ఆరోగ్యాలు చెడగొట్టుకొంటున్నారు. కాల్పుల తర్వాత ఎన్జీఓల్లో ఎక్కళ్లేని ఆవేశం వచ్చేసి, నిరవధికసమ్మె చేసేస్తాం అన్నారు. రెండురోజులు చేశారోలేదో పాత అనుభవాలు గుర్తొచ్చాయి. సమ్మె గిమ్మె లేదు పొమ్మన్నారు; హాయిగా ఆఫీసులకు వెళ్తున్నారు; జీతాలు తీసుకొంటున్నారు. విద్యార్థులేమో అమాయకంగా, ఆవేశంగా-అట్లానే—నెలా రెండు నెలలూ కాదు-ఈ సంవత్సరమంతా సమ్మెచేద్దాం! మొన్న టౌనహాల్లో సమైక్యతావాదుల సభలో వి. ఆర్. కాలేజి లెక్చరరు ఎం. పట్టాభిరామరెడ్డి అన్నట్లు – నిరుద్యోగమనేది అసలు జబ్బు; ముల్కీసమస్య ఆ జబ్బుమీదవచ్చిన జ్వరం. జ్వరానికి మందువేస్తే అసలుజబ్బు నయమౌతుందనుకోవడం తెలివితక్కువ.

ఎన్జీఓలు, నాయకులు విద్యార్థులను వీధుల్లోకి తెచ్చారు. వాళ్ళసొమ్మేం పోయింది? వాళ్ళ ఉద్యోగాలూ పోలేదు, పదవులూ పూతలేదు. రాష్ట్రమంతా ఇంతమంది విద్యార్థులు నిరాహార దీక్షలు చేస్తున్నారుకదా; ఎక్కడైనా ఒక్క ఎన్జీఓ కనీసం ఒక్కపూట భోజనం—కాకపోతేటిఫిన్, అదీకాకపోతే కప్పు కాఫీ—మానుకున్నారేమో అడగండి! వీళ్ళకు విద్యార్థులమీద సానుభూతిలేదు, వాళ్ళ చదువులు నాశనమౌతున్నాయనే దిగుల్లేదు, వాళ్ళ భవిష్యత్తులు దెబ్బతింటున్నాయనే చింతలేదు. విద్యార్థులకు మాత్రం వీళ్ళమీద జాలి వుండాలి, వీళ్ళకోసం అన్ని త్యాగాలూ చేయాలి! ఏమిన్యాయమండీ ఇది?

సమస్య వచ్చినప్పుడు విద్యార్థులు సమ్మె చేయాల్సిందే. కాని దానికొక పద్ధతి వుండాలి. వాళ్ళకు పెద్దదారిపట్టించకుండా చూడాల్సినబాధ్యత నాయకులమీద వుంది. అసలు వుద్యమమంటూ అవసరమైతే అది ప్రభుత్వనిర్ణయం వచ్చినతర్వాత లేవాలి కాని ముందుకాదు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోకాముందే విద్యార్థులు సమ్మె చేయాల్సివస్తే యింక ఈ మంత్రులెందుకు, ఎం.ఎల్.ఏ లెందుకు, నాయకులెందుకు? వాళ్ళు చేయాల్సిన పని విద్యార్థులు చేయాల్సివస్తే ఇక వాళ్ళనెందుకు మనం ఎన్నుకోవడం?

ఇందిరమ్మ యిచ్చిన వరాలు న్యాయమైనవా కావా, సమ్మతికరమైనవా కావా వగైరా గాథల్లోకి పోవడంలేదీ శీర్షిక. అవి నచ్చితే ఒప్పుకోనీండి; నచ్చకపోతే తప్పుబెట్టనీండి కాని ఉద్యమాన్ని ఇంత విచ్చలవిడిగా, యింత ప్రీమెచ్యూర్‌గా లేవదీయడం, విద్యార్థులను పెడదారిపట్టించడం మాత్రం సహించరాని నేరం!

ఈ ఉద్యమంలో నష్టపోయింది విద్యార్థులుమాత్రమే; లాభమనేది ఏమైనావుంటే అది ఎన్జీఓలకు, నాయకులకు దక్కుతుంది. ఇందిరమ్మ యిచ్చిన పరిష్కారం నచ్చకపోతే ఈ ఎన్జీఓలను చేయమనండి సమ్మె; నాయకులను చేయమనండి రాజీనామా-తేలిపోతుంది వాళ్ళసత్తా!

ఈ శీర్షికలో రాజకీయాలు తప్ప యింకావేమైనా చర్చించాలనుకొన్న ఈ కాలమిస్టుకు నియమభంగంకాక తప్పలేదు. ఐనా యివి రాజకీయాలు కావు, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయాలు; తమ ప్రయోజనాల కోసం విద్యార్థులను వాడుకొంటున్న, వాళ్ళ జీవితాలతో ఆడుకొంటున్న వారి అనాలోచనలు. అమాయకంగా, ముందు వెనకా చూడకుండా వరదవలలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరవుతున్న విద్యార్థులను హెచ్చరించకుండా ఎట్లా వుండగలడీ కాలమిస్టు?

— —

### ఒకే కాన్పులో ముగ్గురు ఆడపిల్లలు!

గూడూరు తాలూకా వడ్డిపాళెం వాసి, గిరిజనుడైన మల్లగుంట చినయ్య భార్య పోలమ్మ 17 తేది ముగ్గురు ఆడపిల్లలను తేలికగా ప్రసవించింది. తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా వున్నారు. పల్లిపేట డాక్టరు, నర్సు ఆ బిడ్డలను రోజూ చూస్తూ, వారి ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహిస్తున్నారు. పల్లిపేట రైతులు పెక్కుమంది ఒకేసారి ముగ్గురు బిడ్డలను పొందిన ఈ పేదకుటుంబానికి బియ్యము, డబ్బులు, బట్టలు వగైరా రూపంలో సహాయపడుతున్నారు. నిరుపేద బిడ్డల పోషణకు ఈ విధంగా అన్ని విధాల సహాయపడడమనేది ప్రశంసనీయం.

— జి. సుందరరావు

### గూడూరు లయన్స్ వస్త్రదానం



గూడూరు లయన్స్‌క్లబ్బు చిల్లకూరు సమీపంలోని ఠక్కర్‌బాపా గురుకులం ఆదివాసి ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు 60 మందికి— డి. ఎస్. పి. శ్రీ డి. నారపరెడ్డిద్వారా వస్త్రదానం చేయించారు. చిత్రంలో ఎడమనుండి: లయన్స్‌జోనల్ ఛైర్మన్ వల్లపరెడ్డి సుబ్బరామరెడ్డి, డి ఎస్. పి. నారపరెడ్డి, గూడూరక్లబ్బు కార్యదర్శి ఎం. వి. కృష్ణారెడ్డి, లయన్ బత్తెన రాఘవయ్య.

### నందిని విజయం

(2 వ పేజీతరువాయి)

చింది. ఎంత గుండెదిటవు కల్గివుండాలి ఆ వైఖరి నవలంబించడానికి! ఎన్నికల్లో ఆమె మాజీస్నేహితులైన కమ్యూనిస్టులు తప్ప మిగిలిన అన్ని ప్రతిపక్షాలను ఎదుర్కోడానికి ఆమెఆయుధం ముఖ్యమంత్రిత్వమైతే కావొచ్చుగాని, ఆ ఆయుధం పనిచేయకపోతే తన భవిష్యత్తు భగ్నమౌతుందన్న సంకోచంకూడా లేకుండా ధైర్యసాహసాలతో ఆమె నిల్చింది; గెల్చింది అభినందనీయురాలు నందిని!

— —

# పంచాంగం

### నీచ సంయోగం

72 డిశంబరు 4, 5, 6, తేదీలలో రవి బుధుల, చంద్ర నీచస్థిత సంయోగం ఇది వికలాపస్థాస్పదమైనది.

### జ్యేష్ఠకార్తె

డిశంబరు 2 తేది రాత్రి గం 6-59 లకు జ్యేష్ఠకార్తె ప్రవేశం.

### సామాన్య ముహూర్తములు

డిశంబరు, 2, 3, 7, తేదీలు సామాన్య ముహూర్త తేదీలు.

### డిశంబరు తిథులు

| | | | |
|---|---|---|---|
| 2 శని | ద్వాదశి | రా. 7-03 | గం.వ |
| 3 ఆది | త్రయోదశి | రా. 8-46 | ,, |
| 4 సోమ | చతుర్దశి | రా. 10-41 | ,, |
| 5 మంగళ | అమావాశ్య | రా. 12-38 | ,, |
| 6 బుధ | మార్గశిర శుద్ధ పాడ్యమి | రా. 2-33 | ,, |
| 7 గురు | విదియ | తె. 4-19 | ,, |
| 8 శుక్ర | తదియ | తె. 5-49 | ,, |

—నిమ్మగడ్డ వేంకటేశ్వరశాస్త్రి.


### జమీన్ రైతు

| | |
|---|---|
| సంవత్సరం చందా | రు. 16—00 |
| 6 మాసములకు | రు. 8—00 |
| విడిప్రతి | రు. 0—30 |



చలికాలానికి

ఉలన్ స్వెట్టర్లు

మఫ్లర్లు

పిల్లల

ఉలన్ సూట్సు

టోపీలకు

సిటీ డ్రెస్ హౌం

ట్రంకురోడ్డు

నెల్లూరు

టెలిఫోన్: 444.

బలాదిలేహ్యం

నరముల బలహీనత, నిస్సారత, గుండెదడ, బ్లడ్‌ప్రెషరు మొ॥ పోగొట్టి, బలము రక్తపుష్టి, వీర్యవృద్ధిని కలిగించును.

400 గ్రాముల సీసా రు 11—25 లు

200 గ్రాముల సీసా రు 6—00 లు

అన్ని మందుల షాపులలో దొరుకును.

జనార్దన ఆయుర్వేద నిలయం.

కలువాయ (పోస్టు), నెల్లూరు (జిల్లా)

చలికాలానికి

స్వెట్టర్లు, మఫ్లర్లు, టోపీలు,

రగ్గులు, శాల్వలు,

బెడ్‌షీట్లు వగైరాలు

లభించును.

మాడరన్ స్టోర్సు

ట్రంకురోడ్డు - నెల్లూరు.

బిన్నీవారి:

"కాట్స్‌వూల్"

లభించును

ప్రకటన

కోవూరు గ్రామపంచాయతి బందెలదొడ్డియందు ఆవు ఒకటి (తెల్ల పుల్ల ఆవు, సుమారు 4½' ఎత్తు కలదు బెదిరివున్నది, సూడాపు) 14-11-72 తేదినుండివున్నది. ఇంతవరకు యెవ్వరును విడిపించుకొనిపోలేదు కాబట్టి స్వంతదారులు తగు ఆధారములతో 11-12-72 తేది సోమవారం మధ్యాహ్నము 3 గంటలలోపల విడిపించుకొననియెడల సదరు ఆవును 11-12-72 తేది సాయంత్రము 4 గంటలనుండి కోవూరు గ్రామపంచాయతీ కార్యాలయమునందు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిగాని, లేక అధికారము పొందినవారిగాని బహిరంగముగా వేలముచేయబడును పాట ధరావత్తు రూ. 25 చెల్లి చవలయును.

Md. గౌస్ మొహిద్దీన్,

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు,

కోవూరు గ్రామపంచాయతి.

'ఆల్‌విటాల్'

నరముల పటుత్వము, రక్తపుష్టి, వీర్యశక్తి కలిగించు నూతన తెలుగు సానంగము

220 మి. లి. రూ. 5-90 లు

450 మి. లి. రూ. 10-90 లు

అన్ని మందులషాపులలోను దొరుకును.

☞ కోరినవారికి కేటలాగు ఉచితం.

ఎ. యస్. ఫార్మా,

రాయాజీవీధి - నెల్లూరు.

## కావలెను

పత్రికా వ్యాసంగంలో అనక్తి కలిగి, ప్రత్యక్ష శిక్షణ పొందగోరే విద్యావంతులైన యువకులు కావలెను. ఈ గోలకొండుకూరు ప్రాంతంవారైతే ప్రాధాన్యత. దరఖాస్తు అవసరంలేదు; స్వయంగా కలసుకోవచ్చు.

— జమీన్ రైతు, నెల్లూరు.

## నెల్లూరు అ. డి. ము. కోర్టులో

Scs. 61 of 70 E. P. 13 of 72

సయ్యద్ అబ్దుల్ అలి వగైరాలు —వాదులు

1. ఫాతిమా బీబి 2. షేక్ అబ్దుల్ రహిం —ప్రతివాదులు.

ఈ నెంబరు డిక్రీజారీకిగాను 1-వ ప్రతివాది తాలూకు యిందు క్రింద వుదహరించిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పైకోర్టు వద్ద 11-12-72 తేది 12 గంటలుపైన 5 గంటలులోపల యేలం జరుపబడును.

షెడ్యూలు: నెల్లూరు రి. డి. యిలాకా నెల్లూరు సబ్ రిజిష్టరులో చేరిన నెల్లూరు కుమ్మరవీధిలో చెందురాముడు వీధిలో 1-వ ప్రతివాది ఫాతిమా బీబికు హక్కుగల మున్సిపల్ వార్డు నె 22 రు డోరు నెం. 287 గల పూరియిల్లు ఖాళీస్థలముకు హద్దులు: [తూ] షిప్ ఖాశిం బాషా యింటి స్థలం [ద] షేకు మస్తాన్‌సాహెబ్ యిల్లు [ప] రాజవీధి [ఉ] కరీ. మోహీన్ యిల్లు యీ హద్దులలో 2 అంకణములు కట్టుబడిగల పూరియిల్లు ఖాళీస్థలం మొత్తం 12 అంకణములు. వాటికి మొత్తం రూ. 500 లు అయినా కిమ్మత్తు రూ. 1000 లు.

—Md. రషీద్‌బాషా, వాదుల అడ్వకేటు.

## ఏలం ప్రకటన

In the Court of the Subordinate Judge, CHITTOOR

O. E. P. No. 27 of 1970

O. S. No. 157 of 1967

Between:
V. Dhanalakshmammal —Petitioner (D. Hr.)
And
M. K. Devarajulu —Respondent (J. D.)

NOTICE

పైనెంబరులోని ప్రతివాది యం. కె. దేవరాజులుకు బాధ్యపడిన ఈ క్రింది షెడ్యూలుదాఖలా సొత్తును 8-1-1973 తేదిన పగలు 11 గంటలకు పైకోర్టువారి యెదుట బహిరంగమైన యేలము జరుపబడును. కావలసినవారు సవాలు చేయవచ్చును:

## సొత్తులు వివరం

చిత్తూరుజిల్లా, చంద్రగిరి తాలూకా, పాకాల గ్రామంలో, దావడివీధిలో వున్న వా. కి బాధ్యపడి, ప్రతివాది స్వాధీనాను భవంలోయుండు టి. డి. నెం. 1857 సర్వే నెం. 12/6/5 విస్తీర్ణం 0-44 ట్లు శిస్తు 0-14-0 యిందుకు హె. 0-178 వంక పొరంబోకు పడమర: కోటంగి మునస్వామినాయుడు నేలకు ఉత్తరం: నామినేని తిప్పన్న నేలకు తూర్పు-దక్షిణం: యీ మధ్య 0.20 ట్లు శిస్తు 0-6-9 యిందుకు హె. 0-81 గల నేలయున్న యిందులో యుండు దాదాపు 1 పూరాయున్న యిందులో కట్టియుండు గారమిద్దె యిల్లు 1 కొత్తగా కట్టియుండు షెడ్డు-1 యిందుకు అమర్చిన తలుపులు, ద్వారబంధములు, యింటిలోయుండు పిండిమిషను, వడ్లమిషను, యిందుకు సంబంధించిన యావత్తు సామానులున్ను, అసలు కొయ్యసామానులు యావత్తున్ను, కట్టుబడిసహాయున్ను యిందుకు సర్వేనెంబరులోని చింతచెట్టునకు 2/3 భాగంగల హక్కునకు.

—కె. సి. వరదాచారి, పిటీషనరు అడ్వకేటు.


# సామాజిక అవగాహనలేని సాదాచిత్రమే; అయినా ఇంటిల్లపాదీ నిర్భయంగా చూడొచ్చు-

# బడిపంతులు

ప్రయివేటు మేనేజ్‌మెంట్ క్రిందవున్న విద్యాసంస్థల్లో ఎన్నో రకాల సమస్యలున్నాయి; ఒక సినిమాకు సరిపడే కథ లభిస్తుంది. ముఖ్యంగా వాటిలో పనిచేసే టీచర్ల మూగవేదన, యిటు మేనేజ్‌మెంటుకు, అటు ప్రభుత్వానికి మధ్య నలిగిపోయే ఆ బలహీనపు బ్రతుకులు, వాళ్ళ ఆత్మ సంఘర్షణ - ఏ దర్శకుడికైనా తీసే దమ్ములుంటే దక్కని ఇతివృత్తమే దొరుకుతుంది.

త్రివేణి ప్రొడక్షన్స్‌వారి 'బడిపంతులు' అలాంటి సామాజిక సమస్యతో ప్రారంభ

## మా సమీక్షకుడు

మవుతుంది. ఒక చిన్న పల్లెటూర్లో ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా వచ్చిన రామవరావు స్కూలు కరెస్పాండెంటు పాపారావు అక్రమపాలనను, అన్యాయార్జనను వ్యతిఘటించడంతో కథ మొదలవుతుంది. మంచి ఎత్తుగడ. సమాజ సమస్యలను ప్రతిబింబించే చిత్రాలు పొత్తుగా కరవైపోతున్నాయనుకొంటుండే రోజుల్లో 'బడిపంతులు' ఒక ప్రయోజనాత్మక చిత్రంగా రూపొందగలదనే ఆశను ప్రారంభంలో కల్గిస్తుంది. న్యాయానికి నిలబడ్డ రామవరావును గ్రామస్తులు బలపరచడం, పిల్లలు ఆదుకోవడంవరకూ కథ ఆ దారిలోనే నడుస్తుంది 10 తరగతి పాసై ఆతని ఇద్దరు కుమారులను కాలేజి చదువులకు పంపడానికి అతను పడే బాధ బడిపంతుళ్ళ దైన్యస్థితిని ప్రతిఫలిస్తుంది.

ఆ తర్వాత కథ మరొక మలుపు తిరుగుతుంది. ఆ యిద్దరు కుమారులు ఇద్దరమ్మాయిలను ప్రేమించి, పెళ్ళిచేసికొని తల్లిదండ్రులను విస్మరించడం, రామవరావు ఆర్థికబాధలు, కుమార్తె వివాహానికి అతను పడే యిబ్బందులు, కుమారులు విశ్వాసఘాతకులు కావడం, వాళ్ళవంచనచేరిన తల్లిదండ్రులు అవమానాల పాలు కావడ ... ఇలా కథ యెన్నో మలుపులు తిరిగి, చివరికి అందరికీ జ్ఞానోదయమై చెంపలువాయించుకొని గూష్ఫోలో దిగడంతో కథ సుఖాంతమౌతుంది

దీనికొక కన్నడచిత్రం మూలం కాబట్టి కథ, కథనం వగైరా బాగోగులన్నీ మూల దర్శకుడికే చెందాలి. ఐతే ఆ మూలాన్ని సక్రమంగా అనుసరించి, కథను గబ్బుపట్టించకుండా నూటిగానడిపినందుకు తెలుగుదర్శకుణ్ణి అభినందించాలి. అంతకన్నా ముఖ్యంగా ఇందులో బూతు శృంగారం, అసభ్యదృశ్యాలు ఎక్కువగా లేనందుకు; ఫైట్లు, పైటింగులు చొప్పించి, 'ఇది తెలుగుదేశమేనా?' అన్న అనుమానం కల్గించనందుకు దర్శకుడు అభినందనీయుడు. ఇంటిల్లపాదీ నిర్భయంగా, నిస్సంకోచంగా చూడదగినచిత్రం 'బడిపంతులు'.

ప్రారంభంలో రాము అనే తెలివైన తుంటరి పిల్లవాడిలో హెడ్మాస్టరు రామవరావు పరివర్తనతెచ్చి, సన్మార్గుణ్ణి చేసిన సన్నివేశం గుండె కు హత్తుకునేట్టు చిత్రీకరించాడు దర్శకుడు. అట్లాగే రామవరావు నూతనగృహ ప్రవేశం, షష్టిపూర్తిరోజు సన్నివేశాలుకూడా హృద్యంగా చిత్రీకరించబడ్డాయి. కథ రెండవ మలుపుతిరిగిన తర్వాత అంతా సాదాగానే సాగిపోతుంది. ఒక కొడుకుయింట్లో తండ్రి రామవరావు, మరొక కొడుకుయింట్లో తల్లి జానకిపడిన బాధలు వగైరాలు చాలా మెలోడ్రమెటిక్‌గా చూపించబడ్డాయి. వాటినన్నిటిని మరింత సహజంగా చిత్రించివుంటే చిత్రాని కొంత హుందాతనం చేకూరి వుండేది; దర్శకుని ఊహాశక్తి ద్యోతకమైవుండేది.

ఏ సన్నివేశాన్నయిన ప్రేక్షకుల ఆలోచనను ప్రేరేపించే ఊహాశక్తితో చిత్రీకరించడం ఒక పద్ధతి; ఉన్నది వున్నట్టు 'ఫొటో'గా రూపొందించడం మరొకపద్ధతి. మొదటి పద్ధతిలో దర్శకుని ప్రతిభ కనిపిస్తుంది; రెండవ దానికి గొప్ప ప్రతిభ అవసరంలేదు కాని సిన్సియారిటీ కావాలి. ఈ చిత్రంలో దర్శకుడు రెండవ పద్ధతినే అనుసరించాడు

అదేవిధంగా సన్నివేశాల బలంతో కథ నడపడం ఒకఎత్తు; పాత్రల మనస్తత్వంతో సన్నివేశాలను నడపడం మరొకఎత్తు ఈ చిత్రంలో దర్శకుడు మొదటి మార్గాన్నే పోయాడు. అందువల్ల ఆ మేరకు చిత్రాన్ని హిట్‌గానే తయారుచేయగల్గాడు.

దర్శకుడు ప్రధానంగా దృష్టిలోవుంచుకున్న పాత్ర ఒక్కటే-రామవరావు అతడు సద్గుణాల పుట్ట. మిగతావన్నీ అతనిచుట్టూ తిరుగుతూ అతని మంచితనాన్ని, సహనాన్ని ప్రేక్షకులకు తెలియచేసే సన్నివేశాలను కల్పించేందుకు ఉపకరించే ఉపపాత్రలే అందువల్ల రామవరావు ఇద్దరుకొడుకుల పాత్రలూ కృత్రిమంగా రూపొందాయి ఆ పాత్రలను పరోక్షంగా

# చిత్ర సమీక్ష

మలచుకొని వుండివుండవచ్చు దరిద్రంలో, తీరని కోరికల్తో పెరిగిన ఆయువకులిద్దరూ ఒక్కసారిగా గొప్పింటి అల్లుళ్ళు కాగానే, జీవితాల్లో అనుభవించాల్సినదంతా సులభంగా అందుబాటు కావడంతో వాళ్ళలోని మంచితనం, తల్లిదండ్రులపట్ల గౌరవాభిమానాలు మరుగున పడిపోయి, తమ అభివృద్ధికి కారకులైన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేశారు- అన్నట్టు ఆ పాత్రలను తీర్చివుంటే వాటికిన్యాయం చేసినట్టయ్యేది; జీవం పోసినట్టయ్యేది.

ఈ చిత్రానికి 'బడిపంతులు' అని పేరు పెట్టారు. కాబట్టి బడిపంతుళ్ళ సమస్యలకు, జీవితానికి సంబంధించిన కథ అయివుండాలి కాని ఇందులో రామవరావు జీవితంలో తారసిల్లే సంఘటనలు అతను బడిపంతులైనంత మాత్రాన్నే యేర్పడినవికావు కుమార్తులచేత నిర్లక్ష్యం చేయబడ్డ వ్యతి తండ్రి ఈ సమస్యల నెదుర్కోవచ్చు ఆ సన్నివేశాలు కలగడానికి రామవరావు బడిపంతులే కానక్కరలేదు; ఒక సామాన్య కుటుంబీకునిగా చూపించినా ఆ కథ ఆ తీరులో నడిపించివుండవచ్చు బడిపంతులైనందువల్ల అతను సమాజంలో ప్రత్యేకించి ఈ కష్టసుఖాలకు గురయ్యాడు - అని చెప్పేందుకి చిత్రం అవకాశమివ్వలేదు. కాబట్టి ఇది సామాజిక సమస్యతో ప్రారంభమైనా, కాసేపటికే సాదా కౌటుంబిక సమస్యల కలితమైన చిత్రంగా తయారవుతుంది. అవన్నీ పట్టించుకోకుండా- ఏదో ఒక కథ, దాని చిత్రణ అన్నట్టుచూస్తే ఇది 'యావరేజ్ చిత్ర'మని పిస్తుంది.

ఇద్దరు కుమారుల ప్రేమాయణాలకు అనవసర ప్రాధాన్యతనివ్వకుండా జాగ్రత్తపడ్డ దర్శకుడు పిచ్చయ్య శృంగారానికి ఎందుకు అధికప్రాధాన్యత యిచ్చాడో అర్థంకాదు. బహుశా హాస్యంకోసం ఆ సన్నివేశాలను చొప్పించాడేమోకాని అవి కథకు ఏ విధంగానూ వుపకరించలేదు; పైగా పూర్వార్థంలో చకచకా నడచిన కథను

—తరువాయి 7 పేజీలో

# అవకాశవాదుల అసలురంగులు బయటపెట్టిన

# ప్రజానాయకుడు

మూడు వందల సంవత్సరాల బానిసత్వంలో మగ్గిన భారతమాత దాస్య శృంఖలాలను తెగగొట్టటంలో రెండురకాల పోరాటం సాగింది ఒకటి శాంతియుత పోరాటము మరొకటి విప్లవాత్మక పోరాటము ఈ స్వతంత్ర పోరాటంలో ఎంతోమంది సర్వస్వం త్యాగంచేశారు. మరెంతోమంది ప్రాణదానం చేశారు. స్వార్థంతో బ్రిటిష్ వారితో చేతులుకలిపి వారి మన్ననను పొందిన దేశద్రోహులు గూడా ఆ వాతావరణంలో రూపొందారు.

ఎందరో దేశభక్తుల అకుంఠిత త్యాగాల ఫలితంగా ప్రతిఫలించిన స్వరాజ్యంలో అవకాశవాదులు ఎంతోమంది తలలెత్తారు; పదవులను అలంకరించారు; ప్రజానాయకులయ్యారు ప్రజల సుఖాలను విస్మరించి తమ స్వార్థాన్నే వృద్ధిచేస్తున్నారు. పదవుల కోసం అంతే జుట్టు అందకుంటే కాళ్ళు పట్టుకుంటున్నారు. పదవిని దుర్వినియోగం చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా పెట్టుకున్నారు. విందులు వినోదాల్లో తేలి తూలిపోతున్నారు. అనాటి బ్రిటిష్ వారి కంటే, యీనాటి ప్రజానాయకులు ఎంతో ఘోరంగా తయారవుతున్నారు. ప్రజాశత్రువులుగా మారుతున్నారు. ఆ నాడు బ్రిటిష్ వారిని మన దేశంనుంచి తరిమి కొట్టేందుకు ప్రజలు ఎంతటి పటుతరమైన పోరాటం సాగించారో యీ నాడు చలామణి అవుతున్న స్వార్థపరులైన ప్రజానాయకులపై అంతకంటె, పట్టుదలతో పోరాటం సాగించందే ప్రజా శ్రేయస్సు పునాదులు కదలిపోతాయి. స్వరాజ్య సాధం కూలిపోతుంది.

శశికళా ఆర్ట్ థియేటర్స్ పేర నాగభూషణం సమర్పించిన 'ప్రజానాయకుడు' చిత్రం యీ సంఘటనానేపథ్యానికి ఒక దాఖా.

చిత్రంలో సగభాగంలో స్వరాజ్య పోరాటం చూపబడింది. చరమభాగంలో స్వాతంత్ర్య సముపార్జన తర్వాత ప్రజాపాలనలో ప్రజానాయకుల కుతంత్రాలు స్వార్థచింతన చూపబడ్డాయి.

మన దేశ స్వాతంత్ర్య సముపార్జనలో శాంతియుత పోరాటం ముఖ్యపాత్ర వహించింది. విప్లవపోరాటం వుపపాత్ర ను నిర్వహించింది. కాని నాగభూషణం తన చిత్రంలో స్వాతంత్ర్య సముపార్జనకు విప్లవపోరాటమే చూపాడు. స్వాతంత్ర్య సాధనకేకాదు, స్వార్థపరులైన ప్రజానాయకుల గుట్టు బైటపెట్టేందుకు, వారు సంపాదించిన కోట్లకట్టు పట్టుకునేందుకు, వారికి గట్టిగా బుద్ధిచెప్పేందుకుగూడా నాగభూషణం విప్లవధోరణినే అనుసరించాడు.

నాగభూషణం విప్లవనటుడు. రక్తకన్నీరు నాటకంలో తనపాత్రతో ఒక విప్లవం సృష్టించాడు. నాటకరంగంలోనే కాదు,సినిమారంగంలోగూడా వ్యంగ్యంతో కూడుకున్న తన సంభాషణల విసురుతో విప్లవం వెదజల్లాడు నాగభూషణం విప్లవనటుడు కాబట్టే తన "ప్రజానాయకుడు" చిత్రంలో విప్లవమే చూపాడు, చాటాడు

ప్రథమంలో "ప్రజానాయకుడు" చిత్రానికి సెన్సారు సర్టిఫికెట్ యివ్వని విషయం అందరికీ తెలిసిందే విప్లవం మోతాదు ఎక్కువగావున్న భాగాలు కత్తిరించి తర్వాత సర్టిఫికెట్టు యిచ్చారట. స్వార్థపరులైన మంత్రులు చేసేఘోరాలు ప్రజలు ప్రత్యక్షంగానే చూస్తున్నారు. ఆ చిత్రంలో చూపితేతప్పేమి? కత్తిరించదల చింది చిత్రాలనుకాదు; స్వార్థపరులయిన ప్రజానాయకుల కుత్తుకలను. వారి మనస్తత్వపు మరమ్మత్తుకు ప్రజానాయకుడు చిత్రాన్ని బహిరంగంగా తయారుచేశాడు నాగభూషణం.

చిత్రంలో విప్లవ యువకుడైన కోటేశు తమ నాయకుని ఆచూకీ చెప్పమని హింసించడం, తర్వాత అతన్ని జీపులో ఎక్కించుకొని పోయేప్పుడు అతని తల్లి జీపు వెనకాల రోదిస్తూ పరుగెత్తటం, కోటే

## గ్రిద్దలూరు గోపాలరావు

శును చెట్టుకు కట్టేసి అతని, తల్లి, కుమారుల ముందు నిలువునా కాల్చటం, తల్లి గుండె పగిలి చావటం, యీ సన్నివేశం వేగంగాసాగి ప్రేక్షకుల మనస్సుల పూగిస్తుంది స్వాతంత్ర్య పోరాటం చిత్రీకరణ యింకా కొంత ఘాటుగా చూపేందుకు దర్శకుడు వి. మధుసూదనరావు ప్రయత్నించివుంటే బాగుండేది.

ప్రజానాయకుని గుట్టు గమనిస్తూ అతని భవంతిలో తిష్ఠవేసిన జానకిపాత్ర కొంత అతిశయోక్తితో నిండివుంది. జగ్గయ్య పాత్ర సినీ, గయ్యాళితో కూడుకొని వుదాత్తంగావుంది. రాజబాబు, రమాప్రభల హాస్యం ఆహ్లాదకరంగావుంది. ప్రజానాయకుడు పాత్ర స్వార్థపరులైన యీనాటి ప్రజామంత్రుల నీచవైఖరికి ప్రతిబింబంగావుంది.

ప్రజానాయకుడుగా నాగభూషణం చాలా హుందాగా నటించాడు. జానకి చెప్పుకోతగ్గ నటనే చూపింది. జగ్గయ్య తన చిన్నపాత్రలో పెద్దగా ప్రాముఖ్యతను కల్పించుకొని నటించాడు. కృష్ణ స్వరాజ్యం వచ్చిన తర్వాత ఒక విప్లవ యువకుడుగా ఒప్పు కిరచుకున్నాడు. నటనలో చురుకుదనం కనిపించలేదు.

సంభాషణలు బాగున్నాయి, సంగీతంలో ప్రత్యేకతలేదు.

చిత్రం అక్కడక్కడా కొంత విసుగని పించినా 'ప్రజానాయకుడు' లాంటి చిత్రాలు యీ కుటిల వాతావరణంలో ఎంతైనా అవసరం. అనాడు భారతమాత దాస్యశృంఖలాలను తెగగొట్టేందుకు సాగించిన సంయుక్త పోరాటమే యీ నాడు స్వార్థాన్ని మట్టుపెట్టేందుకు ఐకమత్యంతో సాగించాలి. నిజమైన స్వరాజ్యానికి శంకుస్థాపన చెయ్యాలి. అందుకు ప్రజానాయకుడు చిత్రం ఒక ఉత్తేజం ఒక వుద్రేకం.


మద్రాసులో
నెల్లూరు
నెల్లూరు భోజనం
నెల్లూరు పరిచయం
నెల్లూరి మర్యాద,
అంతా నెల్లూరే!
మీ సుఖానికి
ఇక్కడే దిగండి
హోటల్ నవయుగ
బోర్డింగ్ & లాడ్జింగ్
1 బిషప్ అవెన్యూ రోడ్డు
మైలాపూరు - మద్రాసు-4.
టెలిఫోన్: 76164.

# రైతులోకం

(8 వ పేజీ తరువాయి)

రూపాయలు పెరుగుతుంది! ప్రభుత్వ నిర్ణీత ధర ఒకటి వుండగానేకాక, ఫ్యాక్టరీ హామీ వుండికూడా రైతు నష్టపడడమనే ప్రశ్నే వుదయించదు. ఇది జిల్లా వ్యవసాయ అర్థికాభివృద్ధికి దోహదకారి కాదా? ముఖ్యానికి ఎంతో దోహదకారి!

అందువల్లే ఆ దువ్వూరు బలరామరెడ్డి గారినే మళ్ళీ ఒక ప్రయత్నం చేయవలసిందిగా కోరుతున్నాము. డబ్బువున్న రైతులున్నారు; సినిమాల పుణ్యమాని పాలా డమ్ముకొని సొమ్ము చేసుకున్నవారున్నారు; దీక్ష లేకపోయింది; విలాసాలకో, అవసరం లేని వినియోగాలకో, అదీకప్పితే వడ్డీ వ్యాపారాలకో తప్ప ఈ విధమైన సత్కార్యాలకు వినియోగపడడంలేదు డబ్బున్నవారు సహకరిస్తే బలరామరెడ్డిలాటి వాళ్ళు కృషిచేస్తే, రాజకీయ వాదులు సహాయపడితే సహకార రంగంలో నెల్లూరుకు చక్కెర ఫ్యాక్టరీ రావడం ఏమంత కష్టమైన పనికాదు– ఆ శుభతరుణం కొరకు, ఆ సంతోషవార్త కొరకు ఎదురుచూస్తాం!

★ ★ ★

వచ్చేసంవత్సరం 15 లక్షల టన్నుల ఆహారధాన్యాలను విదేశాలనుంచి దిగుమతి చేసికొనుటకు భారతప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 100 కోట్ల రూపాయలను కూడా తాత్కాలికంగా కేటాయించింది.

ఇది వివేకవంతమైన నిర్ణయమనే చెప్పాలి. ఎందుకంటే– దిగుమతుల అవసరం లేదని, ఖరీఫ్ పంటతగ్గినా లోటును అధిగమించుటకు తగినంత నిల్వలున్నాయని ప్రకటిస్తూవచ్చింది. ఖరీఫ్ పంట ఎంతలోటు వుండబోయేది, నిల్వలో ఏమాత్రం వుండేదికూడా వ్యక్తం చేయడానికి అవసరం వున్నట్టులేదు. రోజుకొకవిధంగా ప్రకటిస్తూవచ్చింది ఈ ప్రకటనలు బింకంగా కనపడ్డాయి ఎట్లయితేనేమి బింకాన్నిపోయి తిండి కరువు తెచ్చిపెట్టకుండా, దిగుమతులకు అంగీకరించినందుకు భారతప్రభుత్వాన్ని అభినందించితీరాలి.

ఉత్పత్తులు హెచ్చడం తగ్గడం అనేది వాతావరణంమీదకూడా ఎక్కువగా అధారపడి వుంటుందనేది వాస్తవమే అయినా; ఇతర కారణాలవల్లకూడా తగ్గిపోతుంటాయి. రష్యాలోకూడా తీవ్రమైన కొరత ఏర్పడింది; అమెరికానుండే దాదాపు కోటి టన్నుల గోధుమలు కాబోలు దిగుమతి చేసుకుంటున్నది. అట్లనే చైనాలో కూడా ఈ సంవత్సరం నాలుగుశాతం ఆహారధాన్యాల వుత్పత్తి తగ్గిపోయినట్లు సాక్షాత్తూ చౌ ఎన్ లై యే స్వయంగా వక్కాణించాడు; వీరున్నూ అమెరికానుండే దిగుమతి చేసుకునేట్లుంది. కమ్యూనిస్టు దేశాలలో అహారోత్పత్తి కుంటుపడుతున్నదంటే, కారణం కేవలం వాతావరణ ప్రతికూలతకాదు; వ్యక్తిగతంగా వుత్సాహ ప్రోత్సాహాలులేని ప్రభుత్వ వ్యవసాయక్షేత్రాలే కారణం

మనలాంటి దేశాల పరిస్థితి అసికాదు మనదేశంలో ఇంకా వ్యక్తిస్వామ్యం వుంది పదిహేవులు మిగులుతాయ అంటే, రాత్రి బవల్లు కష్టించి కృషిచేసే రైతాంగంవుంది. ఆధునిక వ్యవసాయపద్ధతులు, అధికదిగుబడి రకాలవల్ల అదాయం ఎక్కువంటే, వాటిని అవశ్యం అవలంబించే రైతాంగం వుంది. ఇటీవల అనతికాలంలో దేశంలో వుత్పత్తి పెరిగి, స్వయంపోషక స్థితికి వచ్చామంటే, రైతాంగం వుత్సాహంగా పండించడమే కారణమని చెప్పాలి. సస్యవిప్లవానికి కేవలం రైతుల వుత్సాహమే చాలునని మేమనడంలేదు. శాస్త్రీయ పరిశోధనలు ముఖ్యం; అధిక దిగుబడి రకాలను వ్యవసాయ శాస్త్రజ్ఞులు కనగొనకపోయివుంటే, సస్యవిప్లవం సాధ్యమయ్యేదే కాదు. శాస్త్రీయ ప్రగతికితోడు, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు, రైతుకృషికి తగిన ఫలితముకూడా అవసరం. ఇవేకాక, పరిశోధనా ఫలితాలు, ఆ విజ్ఞానం శేబ రేటరీలలో లేక ఆ ప్రయోగక్షేత్రాలలో వరిమితమైతే లాభంలేదు; అవి పొలంలోని రైతుదాకా రావాలి!

కొత్తకొత్త రకాలను కనుగొనడంలో మన శాస్త్రజ్ఞులు వెనుకపడడం లేదుకాని ఆ ఫలితాలను రైతు కందించడానికి తగినంత వ్యవసాయ యంత్రాంగం లేదేమో ననిపిస్తుంది. ఉన్నది బొత్తిగా చాలడం లేదు; అదీ సరిగా వుపయోగపడడంలేదు వ్యవసాయశాఖ అఫీసులు, పైళ్ల వదలి పొలాలమీద ఎప్పుడు పడుతుందో; ఆ శాఖాధికార్లు జీతాలకోసం కాకుండా, అభినివేశంతో ఎప్పుడైతే పనిచేస్తారో, అప్పుడే అది రైతుకు, అధికోత్పత్తికి వుపయోగపడుతుంది అంతవరకు అవి దండగ మారి శాఖే!

అధికోత్పత్తికి రసాయనిక ఎరువులు అత్యంతవసరం. అవి ఎంత పుష్కలంగా దొరికితే, ఎంత సరసమైన ధరలకు దొరికితే– రైతు అంతగా వాటిని వుపయోగిస్తాడు; ఎంతగా వుపయోగిస్తే అంత ఎక్కువగా పండుతుంది. కాని మన ఎరువుల కరువు ఏర్పడుతుంది. మూడు నాలుగేళ్ళ క్రితమే ఎంతో మేలనిపిస్తుంది. ఐదవ ప్రణాళికాంతానికికూడా ఈ కరువు వుండబోతుందంటే, మన అహారధాన్యాల వుత్పత్తి పరిస్థితి అంత అశాజనకంగా, భద్రంగా లేదనే చెప్పవలసి వుంటుంది. ఇప్పుడు మనం ఎరువులను విదేశాలనుండి దిగుమతి చేసుకోక తప్పడంలేదు అటువంటప్పుడు ఆ దిగుమతులను చాలినంతగా చేసికొని, ఎరువుల కరువు లేకుండా చేయడం దేశానికి మంచిదిగదా? అహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కంటే ఇది అభిలషణీయంగదా? ఎరువులు లేకుండా అధికోత్పత్తి, సస్యవిప్లవం అని కలవరించడం హాస్యాస్పదంగా నే వుంటుంది ఎరువులను సబ్సిడీ ధరలకు రైతుకు సరఫరా చేసినా దేశానికి నష్టం లేదనే విషయాన్ని ప్రభుత్వం గమనించాలి!

సస్యరక్షణ సమస్య ఒకటుంది ఇది ఎంత అబందరగా వుండాలో అంత అబందరగా వుంది తెగులుకాని, చీడకాని పైరును కొంతవరకు పాడుచేస్తేకాని రైతు కనుక్కోలేడు తెగులు వచ్చితర్వాత సస్యరక్షణ శాఖవద్దకు పోవాలి; తీరుబడి బుద్ధిపుట్టి వాళ్ళురావాలి; అది ఏమితెగులో నిర్ణయించాలి; ఫలానిమందు కొట్టమని సలహాయివ్వాలి; స్ప్రేయర్లు గిట్లు తయారుగా లభ్యమై మందుకొట్టాలి! ఇదంతా జరిగేసరికి పైరు కొంతకు కొంత నష్టమై పోతుంది. కొందరు రైతులైతే డబ్బులేక, ప్రకృతిమీద భారంవేస్తారు. తెగుళ్ల వల్ల పంట నష్టంకావడమనేది, వ్యక్తులకు జరిగేనష్టంకాదు; జాతికంతా జరిగే నష్టం అందువల్ల సస్యరక్షణ బాధ్యతను జాతి– అంటే ప్రభుత్వమే వహించాలి రైతులలో నిమిత్తం లేకుండానే, పైర్లకు ప్రభుత్వమే మందులు కొట్టించాలి; తెగుళ్ల నుండి పైర్లను కాపాడాలి ఈ ఖర్చును రైతులనుండి తర్వాత వసూలుచేసుకుంటే చేసుకోవచ్చు; లేక ప్రభుత్వమే భరించవచ్చు. ప్రభుత్వమే భరించవలసిన అవసర విషయమని మా అభిప్రాయం

మరలా ఆహారధాన్యాల దిగుమతి స్థితికి వచ్చిన ఈ సమయంలో ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఈ విషయాలను జాగ్రత్తగా పరిశీలించడం, తక్షణ చర్యలకుపక్రమించడం అవసరం.

## బడిపంతులు

(6వ పేజీ తరువాయి)

ఉత్తరార్థంలో చకిలి బడేట్లు చేశాయి ఆ హాస్యంకూడా చవకబారుగానేవుంది.

పాటలు యెక్కడవుండాలో మన దర్శకుల్లో చాలమందికి అంతుపట్టకట్టుంది. ఈ చిత్రంలో చాలా పాటలున్నాయి. కాని వాటిలో మొట్టమొదట స్కూల్లో రాఘవరావు పాడిన ప్రార్థనగీతం, తర్వాత బాలిక పాడిన 'మీనగుమోము'– ఈరెండే సన్నివేశాల్లో అతుక్కున్నాయి. 'మీ నగుమోము' పాట సంగీతపరంగా, సాహిత్యపరంగానేకాక; చిత్రీకరణకూడా చాలా చక్కగా వుంది. చిత్రానికంతటికీ హైలైట్ అదే! బాపనమ్మ రాఘవరావు విడిపోయే సన్నివేశంలో ఒక నేపథ్య గీతముంది ఆ పాట పాడ్తున్నంతసేపు కార్యక్రమాన్నే చూపించబడింది ఇలాంటి పాటలను కథాగమనానికి అడ్డురాకుండా నైనా చిత్రీకరించుకోవాలి; అది చేతకాకపోతే బుద్ధిగా గమ్మునైనా వుండాలి పిచ్చమ్మ దంపతుల డ్యూయెట్లు, బాపనమ్మ మనమరాలు టెలిఫోను పాట పరమదండగ. కథ వేగంగా నడవాల్సిన చోట, బిగువుండాల్సినచోట టెలిఫోను పాట పెద్దబ్రేక్ వేసేస్తుంది.

రాఘవరావుగా రామారావు బాగా నటించాడు రొమాన్సు, లౌ మేకింగ్ లేని ఇలాంటి పాత్రల్లో అతను బాగా రాణించగలడని రుజువుచేసుకున్నాడు మెలోడ్రామాకు బోలెడంత అవకాశమున్న సన్నివేశాల్లోకూడా సంయమనంతో, శృతిమించని నటన ప్రదర్శించాడు. రామారావుతో సరిసమానంగా నటించింది బానకిగా అంజలి కుమార్తెను అత్తగారింటికి పంపే సన్నివేశంలోను, కుమారులు ఎదురుతిరిగిన సన్నివేశాల్లోనూ అంజలి హృదయాలను కదలించే నటన ప్రదర్శించింది. జగ్గయ్య, కృష్ణంరాజు, రామకృష్ణ 10 తరగతి పాసైన బాలాకుమారులుగా నటించడం హాస్యాస్పదంగావుంది. కొత్తతరం నటుల్లో రామకృష్ణ మేలనిపిస్తున్నాడు. కృష్ణంరాజు యింకా చాలా ప్రూవ్ కావాలి.

సంగీతం దడదడలుగా వినిపిస్తుందే కాని సందర్భశుద్ధిలేదు. సంభాషణలు బాగున్నాయి ఐతే యింకా పొదుపుగా వాడివుంటే సన్నివేశాలకు బలం వచ్చివుండేది.

మొత్తంమీద– దర్శకుడు పి. చంద్రశేఖరరెడ్డి సామాజిక అవగాహనం ఏర్పరచుకొంటే మంచి చిత్రాలను తీయగల అవకాశం వుందన్న ఆశాభావం కల్గించింది 'బడిపంతులు.'

## 40 ఏళ్లనాటి 'జమీన్ రైతు' లో

(3 వ పేజీతరువాయి)

వహించవలెయును. రంగమున దిగిన తరువాత వెనుకకు మరలని విధమున కృతనిశ్చయులై యోచించుకొని దిగవలెయును

న్యాయైక దీక్షాపరులు, మండలాధిపతులు మానవేంద్రరావుగారు బోక్కము కలిగించుకొని నలిగిన రయితుల రక్షింపవలయును న్యాయమును పాలించుట ఎరగుందురుగాన వారిందు ఉపేక్షింపరని భావించుచున్నాము పతకము చెదరకముందే సర్ది మండలశాంతిని నిలుపుదురని వారి శక్తియందు మాకు గట్టినమ్మకము మధ్యవర్తిత్వమునకు నమ్మతించిన గూడూరు సబ్ కలెక్టరువారికి మా కృతజ్ఞతా వందనములు. అంత పత్యాగహ సంచలనమునందే మండలమును పంరక్షించి శాంతిని కాపాడిన పోలీసు సూపరిన్టెండెంటు గారికిగూడ ఇది మించినది గాదు. మరియు ఇది వారి ధర్మమైన కర్తవ్యము జమీందారీ రయితులకు తలిదండ్రులు ప్రభుత్వమే! వారి ప్రాణ రక్షకులు పోలీసువారే! జమీందారుని నిరంకుశ క్రూరకృత్యముల తప్పించుకొనుటకు రయితులు ఆశ్రయించ దగినది జిల్లా కలెక్టరు వారి, పోలీసువారి అఫీసులేగదా! కావున జమీందారుల మాటలు విని రక్షకులే రయితుల భక్షకులు కాకుండురని ప్రార్థించుచున్నాము. సత్యమును కనుగొని రయితుల రక్షింతురుగాక!

బిడ్డలకంటే ప్రియమైన పశువులు అల్లాడుచుండ, ధన ప్రాణ మానములు పోనాడుటకు సంసిద్ధులైన జమీందారీ రయితులకు గోవును పూజించు మండల రైతులు సానుభూతిని జూపి ఆశీర్వదింప ప్రార్థించుచున్నాము''

కంచెపుల్లర్ల విషయంలో జమీందార్లు రైతులను ఇరకాటంలో పడేసి, అరకత్తెరలో పోకచెక్కమాదిరి నలిపేసి, నానా యిబ్బందులకు గురిచేయడంవల్లనే జమీందారీ పాలన పట్ల రైతుల్లో తీవ్రమైన అందోళన, అసంతృప్తి యేర్పడ్డాయి. ఆనాడు జమీందారీ వ్యతిరేకోద్యమం ప్రబలం కావడానికి అదొక ముఖ్యకారణమైంది.

జమీందారీ విధానం రద్దయినతర్వాత, స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాతకూడా ఈ కంచెపుల్లర్ల విషయంలో రైతుకు తీరని అన్యాయం జరుగుతూందని ఆ మధ్య కొందరు రైతుశ్రేయోభిలాషులు వాపోయారు జమీందార్లు పోయారు కాని కంచెల సమస్య మటుకు మరొకరూపంలో రైతులను పీడించింది. ఐతే ఆ అన్యాయాన్ని ఎదుర్కోడానికి, ఉద్యమం నడపడానికి స్వాతంత్ర్యానంతరం రైతుకు వెన్నెముక లేకుండా పోయింది. రైతు నోరులేనిమూగజీవి అయ్యాడు. రైతు సంఘాలన్నీ ఆయువు లేకుండా పోయాయి. చెదురుమదురుగా ఒకటి రెండున్నా అవెందుకూ పనికిరానివిగా తయారయ్యాయి ఇదీ నాటికి నేటికి తేడా!

## పల్లెలు

( 35 పేజీతరువాయి)

లకు కాని నిమ్మచెట్లు కాపుకురాదు. ఇదా రేళ్ళు చెట్లును కాపాడటం వ్యయ ప్రయాసలతో కూడినపని. నిమ్మచెట్లు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఏదోఒక రూపంలో సహాయపడటం న్యాయం.

22 తేది రాత్రి గాలికి తోడు 7 వడున్న వర్షంకూడా కురిసిందని, దీనివల్ల చెరువులు తెగిపోవడమేకాక, రోడ్లకు గండ్లు పడి ఆరు రోజులపాటు రాకపోకలు స్తంభించి పోయాయని, పేదవారి ఇళ్ళు నేలకువేలు పడిపొయ్యాయని వెంకటగిరి నుండి శ్రీ పి రాజయ్య వ్రాస్తున్నాడు. రెండు నెలల క్రితం కరవుతో కలవరించెంది, తర్వాత పైర్లు పెట్టుకున్న వెంకటగిరి రైతాంగానికి, ఈ తుఫాను గోరుచుట్టుమీద రోకటిపోటైందనికూడా రాజయ్య అంటున్నాడు.

' ' '

గూడూరు తాలూకా నష్టంకూడా కొద్దిపాటిగా వున్నట్టులేదు; వివరాలు పూర్తిగా తెలియడంలేదు సముద్రతీరాన వున్న 12 గ్రామాలు తుఫాను తాకిడికి తీవ్రంగా గురియైనట్టుంది.

ఈ తాలూకాలో పొగతోటలు విపరీతంగా పడిపోయాయట అదికాకవరగలి, మోమిడి గ్రామాల్లో అరటిచెట్లు కూలిపొయ్యాయట. ఒక్క మోమిడిలోనే 100 ఎకరాలకు పైగా అరటిచెట్లు పడిపోయాయని మాజీ శాసనసభ్యుడు శ్రీ నేదురుమల్లి రామచంద్రారెడ్డి చెప్పారు. అనగా 10 ఎకరాలు పోయినట్లుంది అరటిచెట్ల వల్ల మొత్తం మూడు నాలుగు లక్షల నష్టం వుండవచ్చునని అధికారుల అంచనా. నాలుగుగ్రామాల్లో నిమ్మతోటలు నాశనమయ్యాయట తాలూకాలో మూడు చెరువులు తెగిపోయాయట

విద్యానగర్ లో కాలేజి పాకలకు నష్టం జరిగినట్టుంది. ఓరియంటల్ కాలేజి హాస్టల్ పూర్తిగా కూలిపోయిందట. నష్టమేమీలేదు.

దుగరాజపట్నంలో శ్రీహరికోటకాదికీవుల కుటీరాలన్నీ పడిపొయ్యాయట ఇతర గ్రామాల్లోకూడా అసంఖ్యాకంగా ఇండ్లు కూలిపొయ్యాయట విద్యుత్ స్తంభాలు, టెలిఫోను పోల్సు నష్టంగా పడిపొయ్యాయట

మూలేశ్వనండి పంటలులేని కలిచేడు చెరువు తెగిపోయిందట హరిజనులు, వడ్డెవారి ఇళ్లు చాల మునిగిపొయ్యాయట. వెంకటగిరి రాజాగారు బాధిత కుటుంబాలకు బియ్యం సరఫరాచేశారట.

' ' '

గూడూరు, వెంకటగిరి తాలూకాలకంటే, సూళ్ళూరుపేట తాలూకా తుఫాను తాకిడికి తీవ్రంగా గురైవుండాలి. కాని ఆ తాలూకానుండి అధికారికంగాగాని, అనధికారికంగాకాని ఇది వ్రాస్తున్న సమయానికి సమాచారం అందలేదు


## ఇండ్లు అమ్మబడును

నెల్లూరు మూలాపేట రాజాగారివీధిలో వార్డు 24; డోరు నెం. 269; 270 గల రెండు యిండ్లు సుమారు 40 అంకణముల విస్తీర్ణములో గలవు ఒక టి రేకులయిల్లు 5 అంకణముల కట్టుబడి రెండవది మిద్దెయిల్లు 7 అంకణముల కట్టుబడి. రెండు ఇండ్లు కలిసికాని, లేక విడి విడిగాని అమ్మబడును. చెట్లు, బావి, కుళాయి. వసతులు వుండుటకు వంటగది వుండును. వలయువారు అదే మిద్దెయింటిలో:

**పి. వి. రమణారెడ్డి.**

## ఎల్లుకేసరి విత్తనములు

మావద్ద ఎల్లుకేసరి విత్తనములు మంచివి వున్నవి. కావలసినవారు వచ్చి తీసుకపోవచ్చును.

**పాక్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,**

అల్లిపురం — నెల్లూరు తాలూకా.

ఫోన్: నెల్లూరు 950.

Grams: OPENGER PHONE NO. 70.

**Andhra Pradesh State Electricity Board**

**NOTIFICATION**

1) The date of opening of the tenders for the following works has been extended upto 5—12—72. The tenders specifications will be sold upto 12-00 Hrs. on 5—12—72. Tenders will be received upto 15-00 Hrs. and will be opened at 15-30 Hrs. on 5—12—72.

| S. No. | Specification No. | Description of work |
|---|---|---|
| 1. | 23/72-73 | Mnufacture of 27'0" R.C.C. poles at Naidupet. |
| 2. | 24/72-73 | Manufacture of 27'0" R.C.C. poles at Venkatagiri. |
| 3. | 25/72-73 | Manufacture of R.C.C. base plates at Gudur workshop. |

—V. S. MURTHY,

Divisional Elecl. Engineer, operation - Nellore.



ఒంగోలు దహనకాండలో కలెక్టరుగారి స్వంతఫియట్ కారు, ప్రభుత్వానికి చెందిన అంబాసిడర్ కారు.

## మూడుగంటలు

(మొందటి పేజీకొరవ)

మాటల్లో జరిగినసంగతి. ఈ ధోరణిని ముఖ్యమంత్రి గ్రహించినట్లుంది; వందుకస్తే కొంపమునుగుతుందనుకున్నట్లుంది; మంత్రివర్గ సమావేశంలో ఆ వ్యవస్థపర్చ్ వుదు ముఖ్యమంత్రి చాల దృఢవైఖరి నవలంబిం చారట ప్రధాని పంచసూత్రాలను ఆమోదించలేకపోతే, మంత్రివర్గం రాజీనామాయిచ్చి వైదొలగడమొక్కటే మార్గమని ముఖ్యమంత్రి హెచ్చరించాడట. సమాలోచనలు జరుపుకోవాలనుకుంటె, అప్పుడే అక్కడే మాట్లాడుకోవలసిందిగా ఆంధ్రమంత్రులను కోరాడట. సమావేశాన్ని వాయిదావేసి మూడుగంటలసేపు అక్కడే కూర్చున్నారట ఈలోగా ఆంధ్రమంత్రులు చర్చించుకొని, చివరకు ఆమోదాన్ని తెల్పారట.

నిర్ణయం అప్పుడు వాయిదాపడివుంటే, అది శాశ్వతమైన వాయిదాగానే వుండేదేమోనని పరిశీలకుల అభిప్రాయం ఈ విధంగా ముఖ్యమంత్రి పెద్ద ముప్పును, సంక్షోభాన్ని నివారించాడు. అసమర్థత వహించుకున్నవాడు అజేయుడయ్యాడు!

ముల్కీ విషయంలో ఆంధ్రమంత్రులనుసరించిన వైఖరి, మంత్రివర్గ మార్పులకేమైనా దారితీస్తుందా? ఈ సందేహం కలగడం సహజమే ముఖ్యమంత్రి ఒకడున్నాడని, మంత్రివర్గ సమష్టి బాధ్యతొకటుందనే ధ్యాస్నమేలేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు ఆంధ్రమంత్రులు. పరోక్షంగా నాయకుడుగా పి. వి. ని తృణీకరించారు; ఆయన మీద అవిశ్వాసం వ్యక్తంచేశారు. అటువంటి వారిమీద ముఖ్యమంత్రికి మాత్రం విశ్వాసం ఎట్లావుంటుంది? కాని ఆయన రాజనీతిజ్ఞుడైతే, రాజకీయ చతురుడైతే ఇప్పుడు ఆ విషయాన్నే మనసులో పెట్టుకోడు; మంత్రివర్గ పునర్నిర్మాణం వంటి ఆలోచనలనే దగ్గరకు రానివ్వడు. నరసింహారావుగారిలో వ్యక్తులకి మంత్రివర్గ పునర్నిర్మాణ ఆలోచనకాని, వ్యతిరేకించినవారిని తీసివేయాలనే తలంపుకాని లేనేలేనట్లు నమ్మదగిన వర్గాలనుండి వినబడుతున్నది అది అభినందనీయమైన విషయం. ముందు ఎదుర్కోవలసిన గడ్డు సమస్య ఒకటున్నది— రాష్ట్రంలో ప్రశాంతత నెలకొల్పడం, ప్రజల మనస్సుల్లో ఏర్పడిన భేదభావాలను పోగొట్టడం, గాయాలను మాన్పడం సమష్టిగా మంత్రివర్గము, పార్టీ గట్టిగా పీకల్లోతుమీద పనిచేయందే అది సాధ్యంకాదు.

—

## ఒంగోలు

(మొదటి పేజీ కొరవ)

చేతిలో పెట్టుకొని, కట్టుగడ్డలతో బంగళా నుండి బయటపడి, ఐదు ఇళ్ళలో తల దాచుకోవలసిన పరిస్థితి యేర్పడిందని, ఆసమయంలో తాను అక్కడ వుండివుంటే యింకా ఘోరాలు జరిగివుండేవని ఆయన వివరించారు. తాను ఫైరింగ్ ఆర్డరివ్వక ముందే కలెక్టరు నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపిస్తున్నాడని ప్రచారం చేశారట.

విద్యార్థులు డీజిల్ ఇంజన్ను నాశనం చేస్తున్నారు, రక్షణ యివ్వండి-అని స్టేషన్ నుండి కోరినమీదట, ఊళ్ళో తాసిల్దారుగాని, ఆర్. డి. ఓ. గాని లేకపోయినందువల్ల తానే స్టేషనుకు పోవల్సివచ్చిందన్నారు కలెక్టరు. ఉదయం 9-30 నుండి 11.57 దాకా అక్కడ ప్రజలను శాంతింపచేయడానికి ప్రయత్నించాను; తర్వాత పరిస్థితి చెయ్యిదాటిపోయేట్టు కనిపించింది. 50 మంది ఐదువేలమందయ్యారు; రాళ్ల రువ్వడం మొదలుపెట్టారు; పోలీసులు, సి ఆర్. పి. వాళ్ళు చాలామంది గాయపడ్డారు ఇంతలో నా జీపుకు నిప్పంటించినట్లు తెలిసింది అంతకుముందు డిపుటీ గ్యాసుకు ఆర్డరివ్వడం పొరబాటుగా భావించి, విద్యార్థుల కోర్కెమీద విచారం వ్యక్తంచేశాను. ఐనా జనాన్ని అదుపులో వుంచడం కష్టమైంది. రైల్వేకాబిన్ తగలబడిపోతుంది. ఈ పరిస్థితుల్లో, యింకా నష్టంవాటిల్లే ప్రమాదం తప్పించడానికి ఫైరింగ్ ఆర్డర్లు ఇచ్చాను – అన్నారు కలెక్టరు.



మసి మసి అయిపోయిన ఒంగోలు హెడ్‌పోస్టాఫీసు

## కావలి రాజీనామాలు

ముల్కీకి వ్యతిరేకంగా కావలి మునిసిపల్ కౌన్సిలర్లు శ్రీ యుతులు టి రామమూర్తి, కె పి వెంకయ్య, నూనె సుబ్రహ్మణ్యం, గంగాధరంగారలు రాజీనామా లిచ్చారట. గల్లా రెడ్డి చంద్రశేఖర రెడ్డిగారి వద్ద తన రాజీనామా పత్రాన్ని ఛైర్మన్ గారి చేతికివ్వడం కాకుండా, మీరు కమిషనర్ గారికే అందజేశారట!

కావలి 30 తేది వరకు అమలులో వుండిన 144 సెక్షను డిసెంబరు 10 తేది వరకు పొడిగింపబడి ది

జరిగిన నష్టం గూర్చి కలెక్టరిచ్చిన వివరాలివి–ఒక్క పోస్టాఫీసునష్టమే రెండు లక్షలుంటుందట 70 వేల రూ॥ రొఖం, 40 వేల రూ॥ల స్టాంపులు పరశురామ ప్రీతయ్యాయి. భవనానికి జరిగిన నష్టం కొద్ది హెచ్చు తగ్గులతో పూడ్చుకొని, ఇంకో 15 యేళ్ళదాకా నెట్టవచ్చునట. కలెక్టరాఫీసులో వస్తువులు చాలావరకు రక్షింపబడ్డా, 25 వేల రూ॥ సామాగ్రి కాలిపోయాయట ఆఫీసు కార్లు రెండూ బుగ్గి బుగ్గి అయిపోయాయి; వాటి ఖరీదు 25 వేలుంటుంది. కలెక్టరు స్వంత ఫియట్ కారు కూడా మసి అయిపోయింది. దాని వెల 15 వేలు రైల్వేక్యాబిన్ కాలిపోయింది; నష్టం 10 వేలుండొచ్చు.

కలెక్టరాఫీసు రికార్డు చాలావరకు దగ్ధమైపోయింది ఒక నెలలోపల్నే రికార్డును పునర్నిర్మించడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు కలెక్టరు కనీసం ముఖ్యమైన భాగం రికార్డయినా పునఃసృష్టి చేస్తామన్నారు. అందుకు దాదాపు 40 వేలు ఖర్చవుతుందట!

కలెక్టరు బంగళాకూడా బాగా దెబ్బతిన్నది కలెక్టరు నివాసం కొండమీద డి. ఆర్. ఓ భవనానికి మార్చారు.

మొత్తంమీద యిప్పుడు పరిస్థితి ప్రశాంతంగావుంది. సి ఆర్. పి దళాలు యింకా కొంతకాలం ఒంగోల్లోనే వుంటాయట సంఘ విద్రోహ శక్తులుగా అనుమానింపబడ్డ చాలామంది అరెస్టయ్యారు. కాల్పుల్లో హతులైన వారి కుటుంబాలకు తలా రు 500 లు యిచ్చారు. 26, 29 తేదల్లో ఒంగోల్లో పరామర్శలు జరిపించారు కలెక్టరు.

ఒంగోల్లో 144 సెక్షను అమల్లోవుండి 29 తేది జరగాల్సిన ప్రత్యేక ఆంధ్రోద్యమం కాలాకూ పూరేగింపు, బహిరంగసభ వాయిదాపడ్డాయి.

—

## జనవాణి

(2 వ పేజీకొరవ)

పాలని కలెక్టరను, రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలి. ఆ విధంగా వర్తకస్వామ్యాలని అరికట్టేవాలి. లేకపోతే చౌకడిపోలు మూతపడి, పల్లీయ రథాన్నక రం ధరలు ఆకాశాన్నంటుకొంటాయి. పేద,మధ్యతరగతి ప్రజలు ఆ ధరల నందుకోలేక మలమల మాడాల్సి వస్తుంది. ఆ పరిస్థితి రాకుండా చూచుకోవడం ప్రజల, ప్రజా ప్రతినిధుల కర్తవ్యం

ఎల్లాయపాళెం – జి. బాలకృష్ణారెడ్డి

నర్సరీ

▲

## ఆంధ్ర మంత్రులు రాజీనామాచేయాలి!

ముల్కీసమస్యపై శ్రీమతి ఇందిరాగాంధీ తీసుకున్న నిర్ణయాలు పక్షపాత వైఖరితోను, అంధులను వశ్యపెట్టేరిగను, ఆంధ్రప్రాంతీయుల కన్యాయంచేసేదిగాను వుండడం విచారకరం. రాజధర్మాల కర్తులా విశోషణి స్తి కార్యక్రమాలను చేపట్టే నిర్ధారణ, కాం వాడు బాబా ప్రీని శాసనాన్ని యింకా కొంతకాలం అమలులో వుంచాలంటున్నది ఒకేరాష్ట్రంలో ఒకప్రాంతం వారికి ప్రత్యేక సదుపాయాలు కల్గిస్తూ, మరొక ప్రాంతంవారిని విన్న దూపు చూడటం అనుచితం ముల్కీ అంటోలనపై కేంద్రమంత్రి మీర్జా చేసిన అసత్య ఆరోపణలు, ముఖ్యమంత్రి పి. వి. కపట నాటకం అందుకు అన్యాయం జరగబోతుందని ముందుగానే సూచించారు. తెలంగాణకంతే వెనుకబడిన ప్రాంతాలు ఆంధ్రలో లేవా? ఉభయప్రాంతాల వారుకలు తనమీద భారం వేసిన ప్రధాని ప్రధాని నిష్పక్షపాతంగా తీర్పునివ్వాలి. ఆంధ్ర మంత్రులు అప్పుడే ఆమె నిర్ణయాలను ఆమోదించారట; అవమానకరం! ఆంధ్ర మంత్రులు, ఆంధ్ర శాసనసభ్యులు ప్రజాసేవే తమ పరమార్థమని, పదవులు శాశ్వతం కావని గుర్తించి వెంటనే అందరూ మూకుమ్మడిగా రాజీనామాలు చేసి, అందుకు వరువుకాపాడి, ముల్కీ నిబంధనలు పూర్తిగా రద్దయ్యేందుకు కృషిచేసి, రాష్ట్ర ప్రజలందరికీ సమాన హక్కులు కల్గేంతవరకు శాంతియుతంగా పోరాటం సాగించాలి. విద్యార్థులుకూడా తమ వుద్యమాన్ని ప్రశాంతంగా కొనసాగిస్తారని ఆశిస్తున్నాము.

బిల్లుపాడు —ఎం. శ్రీనివాసరావు

జి. రమణయ్య

కె. సుబ్బానాయుడు

పి. వెంకట్రామనాయుడు

కె. రమణయ్య

▲

## రాగి కడియాలు!

నెల్లూరులో ఇటీవల చాలమంది యువకులు చేతులకు రాగికడియాలు ధరిస్తున్నారు. ఎందుకు వేసుకున్నారంటే ఎవరూ చెప్పలేకున్నారు మీరేమైనా చెప్పగలరా?

నెల్లూరు —గునుపాటి కుమార్

(ఏమి చెప్పమంటారు? ఆరోగ్య వ్యామోహ ... నటి మనయువకుల వ్యామోహాన్ని కొన్ని తరాల వెనక్కు నడుపుతున్నాయి; పైరితలు వేస్తున్నాయి ఎంత విచారంగా, అటు వింగా తయారైతే అంతగొప్ప వ్యామోహం ఆరోజుల్లో! అందుకోసం మనయువకులు కంకణధారులౌతున్నారు. అంతకన్నా గొప్ప పరమార్థం అందులో వుంటే మోమాకు తెలుపుట్టడంలేదు. —నం)

## ఐ. ఆర్. 20

నాణ్యమైన ఐ ఆర్ 20 వరి విత్తనాలు కావలసినవారు ఈ క్రిందివారిని సంప్రదించవలయు

కొండ్రెడ్డి వెంకటసుబ్బారెడ్డి

కలివెలపాళెం,

నెల్లూరు తాలూకా.

## నెల్లూరు సబ్ జడ్జివారి కోర్టులో

O. S. No. 112 of 72

చిన్ని సుబ్బయ్యశెట్టి, పెనల సుబ్బరాయుడు శెట్టి అండ్ కొత్తకంపెనీ రెప్రజెంటెడ్ బై 1. పెనల సుబ్బారాయుడుశెట్టి అండ్ అదర్సు —వాదులు.

మెసర్సు ఆంధ్ర ట్రేడింగ్ కంపెనీ రెప్రజెంటెడ్ బై పార్టనర్సు: 1. ఎల్.ఎం హుసేన్ 2. బయినా ఆంజనేయులు 3 రాచేపల్లి సత్యనారాయణ —ప్రతివాదులు.

పై 1 నుండి 3 ప్రతివాదులకు

ఈ కేసు దావా మీకు నోటీసు ఇవ్వబడి తుది విచారణ 7-12-72 తేదికి వాయిదా అయియున్నది. గనుక మీకుగల ఆక్షేపణలు పై తారీఖున 11 గంటలకు కోర్టుకు హాజరై తెలుపుకొనేది.

—చింతా శ్రీరామమూర్తి,

వాదుల అడ్వొకేటు.

### ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీబోర్డు
### నెల్లూరు థర్మల్ స్టేషన్‌లో బిల్డింగులకు సున్నము వేయుటకు, రంగులు వేయుటకు

## టెండరు నోటీసు

స్పెసిఫికేషన్ నెం. 3/72-73.

ఈ దిగువ సుదహరించిన పనులుచేయుటకు సీల్డు టెండర్లు దిగువ సంతకం చేసినవారిచే 12-12-72 తేది పగలు 3 గంటలవరకు తీసుకొని అదేరోజు సాయంకాలం 4 గంటలకు హాజరయిన టెండరదారుల లేదా వారి అధికారము పొందిన ప్రతినిధుల సమక్షములో తెరువబడును. టెండరుదారుడు రూ. 500 లు క్రాసుచేయబడిన డిమాండు డ్రాఫ్టు రూపములో "డివిజనల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు" ఆపరేషన్ అండ్ మెయింటెనెన్సు, పత్తేఖాన్‌పేట, నెల్లూరువారి పేర స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా కోవూరు (నెల్లూరుజిల్లా)లో జమకట్టవలయును. టెండరు డిపాజిట్టు చెల్లించని టెండర్లు అంగీకరించబడవు.

| వ. నెం. | పని వివరం | షుమారు చేయవలసింది | MDSS NO. | యూనిట్ కొలత | అంకెలలో అక్షరములలో రేటు |
|---|---|---|---|---|---|
| 1. | నెల్లూరు థర్మల్ స్టేషన్ యందలి నివాసముంటున్న బిల్డింగులు మరి ఇతర బిల్డింగులు, గోడలకు సీలింగ్సులకు,సన్ షేడ్ మొ॥వాటికి మంచి గుల్లసున్నముతో రెండు సార్లు సున్నము వేయుట | 3,25,000 చ. అ. | 69 | 100 చ. అ. (నూరు చ.అ.) | |
| 2. | వేయవలసిన దగ్గర భూషణ ప్రకారం రెండు సార్లు గోపిరంగు వేయుట | 22,000 చ. అ. | 70 | 100 చ. అ. (నూరు చ. అ.) | |
| 3. | వేయవలసినదగ్గర భూషణప్రకారం ఒకే సారి స్నోసిమ్ పెయింటువేయుట | 6,000 చ. అ. | 71 | 100 చ. అ. (నూరు చ. అ.) | |
| 4. | వేయవలసినదగ్గర భూషణప్రకారం రెండు సార్లు డిస్టెంపర్ పెయింట్ వేయుట | 2,000 చ. అ. | 71 | 100 చ. అ. (నూరు చ. అ.) | |

పై పని 10-1-73 తేదిలోగా పూర్తిచేయవలెను. ఇతర వివరములు ఆఫీసునుండి పొందవచ్చును. పై తెలిపినప్రకారం రాని టెండర్లు నిరాకరించబడును. ఎటువంటి కారణములు తెలుపకనే టెండర్లు నిరాకరించుటకు ఈ క్రిందివారికి సర్వాధికారములు కలవు.

జి. వెంకటేశ్వరరావు.

డివిజనల్ ఎక్జిక్యూటివ్ ఇంజనీరు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్సు,

పత్తేఖాన్‌పేట, నెల్లూరు. ఫోన్: 467.

Edited, Printed and Published by N. Sree Ramamurthy, at the Zamin Ryot Press, 190, Tipparajuvari Street, Nellore (A. P)